మంగళవారం
TUESDAY
24-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 145

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





బండి గుండె చప్పుడు వేరయా..!

కరీంనగర్, నవంబర్ 23 (ఈవార్తలు): కరీంనగర్‌లో జరిగిన బీజేపీ 'మహా పాదయాత్ర' సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు వార్తల్లో నిలిచాయి. తన గుండె సాధారణంగా 'లబ్ డబ్' అని కాకుండా ప్రతి క్షణం 'జై శ్రీరామ్' అని కొట్టుకుంటోందని వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో జరిగిన బీజేపీ మహా పాదయాత్రలో కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి బండి తరువాయి 2 వ పేజీలో...



మేడిగడ్డ ఉన్నది కరీంనగర్‌లో..?

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ బరాజ్ (లక్ష్మీ బరాజ్) కరీంనగర్ జిల్లాలో ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన విమర్శలకు స్పందిస్తూ సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేడిగడ్డ కరీంనగర్ జిల్లాలో ఉంది. అక్కడి నుండి నీటిని ఎత్తిపోయకపోతే, ఆ నీరు వరంగల్ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టుకు, ఆ తర్వాత ఖమ్మంలోని సీతారామ ప్రాజెక్టుకు చేరుతుంది' అని పేర్కొన్నారు. వాస్తవానికి మేడిగడ్డ బరాజ్ జయశంకర్

మంథనికి దుద్దిళ్ల గుడ్‌బై!?



మల్కాజిగిరి వైపు శ్రీధర్‌బాబు చూపు!

నియోజకవర్గంలో వ్యతిరేకతతో మకాం మార్చే యోచనలో మంత్రి?

సొంత పార్టీ నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి

పుట్ట మధు దూకుడుతో రాజకీయంగా ఒత్తిడి

సీఎం సర్వేల్లోనూ ప్రతికూల నివేదికలు వచ్చాయంటూ ప్రచారం

మంథని నియోజకవర్గానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గుడ్‌బై చెప్పబోతున్నారా? వచ్చే ఎన్నికల్లో మంథని నుంచి కాకుండా మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారా? సొంత నియోజకవర్గంలో పెరుగుతున్న వ్యతిరేకతను ముందుగానే పసిగట్టి రాజకీయ మకాం మార్చాలని భావిస్తున్నారా? ప్రస్తుతం మంథని రాజకీయ వర్గాల్లో ఈ ప్రశ్నలే చర్చనీయాంశంగా మారాయి. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి ఎదురవుతున్న అసంతృప్తి, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజల్లో వ్యక్తమవుతున్న విమర్శల నేపథ్యంలో శ్రీధర్‌బాబు మల్కాజిగిరి వైపు చూస్తున్నారనే ప్రచారం జోరందుకుంది.

మంథని, నవంబర్ 23 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా మంథని నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తికాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండకపోవడం, హైదరాబాద్‌కే పరిమితమై సొంత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే అసంతృప్తి స్థానికంగా వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొందరు కాంగ్రెస్ మంత్రులు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేయడం కష్టమని, ఎంపీలుగా బరిలోకి దిగుతామని బహిరంగంగానే చెబుతున్న నేపథ్యంలో శ్రీధర్‌బాబు కూడా అదే బాటలో వెళ్లేందుకు ఆలోచిస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

మల్కాజిగిరిలో మైనంపల్లి అడ్డంకి?

మల్కాజిగిరి రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఉన్న మైనంపల్లి హనుమంతరావు నుంచి కూడా శ్రీధర్‌బాబుకు వ్యతిరేకత ఎదురవుతున్నట్లు సమాచారం. గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మైనంపల్లి, శ్రీధర్‌బాబు మల్కాజిగిరి పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాలకు వచ్చినా నాయకులు, కార్యకర్తలు హాజరుకావద్దని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల సిద్దిపేటలో మైనంపల్లి హనుమంతరావు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సభకు శ్రీధర్‌బాబు హాజరుకాకపోవడాన్ని కూడా ఈ విభేదాలతో ముడిపెడుతున్నారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ అక్కడి స్థానిక నాయకత్వంతో సఖ్యత లేకపోవడం శ్రీధర్‌బాబుకు మరో రాజకీయ సవాలుగా తరువాయి 2 వ పేజీలో...

జెన్సన్ హువాంగ్ ఈజ్ బ్యాక్

ఎన్విడియా సీఈఓగా మళ్లీ బాధ్యతలు

రాజీనామా నిర్ణయం వెనక్కి

11 రోజులకే రీ ఎంట్రీ!



న్యూయార్క్: చైనా గూఢచర్య వ్యవహారంతో సంబంధాలున్నాయన్న ఆరోపణలు, వ్యక్తిగత జీవితంపై వచ్చిన కథనాల నేపథ్యంలో పదవి నుంచి వైదొలిగినట్లు పేర్కొన్న జెన్సన్ హువాంగ్ .. తిరిగి ఎన్విడియా సీఈఓగా నియామకం అయ్యారు. కేవలం 11 రోజుల వ్యవధిలోనే కంపెనీ తన నిర్ణయాన్ని మార్చుకుని ఆయనకు మళ్లీ బాధ్యతలు అప్పగించింది. బోర్డు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్విడియా సంస్థ ప్రకటించింది. అయితే జెన్సన్ హువాం గ్‌పై వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు మాత్రం కొనసాగనుంది. చైనా గూఢచర్యం ఆరోపణలు, ఆయన పర్సనల్ లైఫ్‌పై వచ్చిన వివాదాస్పద తరువాయి 2 వ పేజీలో...



పప్పూ.. డ్రామాలు ఆపు



ఇగ మీ పప్పులుడకవ్.. మోదీ నిప్పులాంటోడు

టచ్ చేస్తే మాడి మసైపోతావ్

ప్రజల పొట్ట కొడుతుంటే చూస్తూ ఊరుకోవాలా?

రాహుల్‌కు బండి సంజయ్ వార్నింగ్

ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులాంటి నాయకుడని, ఆయనను ముట్టుకుంటే మాడి మసైపోతావంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఎన్ని రాజకీయ డ్రామాలు ఆడినా, విదేశీ శక్తులతో కలిసి కుట్రలు చేసినా మోదీ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు.

కరీంనగర్, నవంబర్ 23 (ఈవార్తలు): దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులు ఓటరు కార్డులు, రేషన్ కార్డులు పొందుతూ స్థానిక ప్రజల అవకాశాలను దెబ్బతీస్తుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు.విదేశీ చొరబాటుదారులకు-2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్:	రూ.12,656
వెండి (కిలో):	రూ.1,75,000
ప్లాటినం (గ్రాము):	రూ.3,890

పల్నాడు పాపం కేసీఆర్‌దే

హరీశ్‌కూ ఆ పాపంలో వాటా

బీఆర్ఎస్ పాలనలోనే వాటర్ గ్రిడ్‌కు బీజం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్



కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్‌కు బీజం పడింది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనని తేల్చి చెప్పారు. తెలంగాణ నీటి హక్కులకు సమాధి కట్టింది మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అన్ని ఆధారాలతో ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడతామని స్పష్టం చేశారు.

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం లేదని తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. 2022లో అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జల్‌జీవన్ మిషన్ కింద రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో తరువాయి 2 వ పేజీలో...

చుక్క నీళ్లివ్వం

తెలుగు రాష్ట్రాల మధ్య మరోసారి కృష్ణా జలాల చిచ్చు

అదనపు నీటిని కోరిన ఏపీ, చుక్క నీరు ఇచ్చేది లేదన్న టీజీ



కృష్ణా జలాల పంపిణీ అంశంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి వివాదం రాజుకుంది. తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి అదనంగా 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరగా.. ఇప్పటికే అధికంగా నీటిని వినియోగించుకున్నారని తెలంగాణ సర్కార్ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అదనంగా కోరిన నీటిలో ఒక్క చుక్క కూడా ఇచ్చేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. మరోవైపు.. రానున్న 3 నెలల తాగు నీటి అవసరాల కోసం తమకు 30 టీఎంసీల నీరు కేటాయించాలని కృష్ణా బోర్డును తెలంగాణ ప్రభుత్వం కోరింది. హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం సోమవారం రోజున జరిగింది. కేఆర్ఎంబీ తరువాయి 2 వ పేజీలో...



1,480 పాయింట్లు పతనం

ఒక్కసారిగా స్టాక్ మార్కెట్ మటాష్

మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణ

ముంబై, నవంబర్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా రెండు రోజుల పాటు కొనసాగిన లాభాల జోరుకు బ్రేక్ పడింది. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో భారీగా అమ్మకాలు వెల్లువెత్తడంతో తరువాయి 2 వ పేజీలో...

విశ్వేవాణి



ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. అత్యాధునిక ఏఐ వ్యవస్థల అభివృద్ధి, నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లు పెద్ద పరిశ్రమల స్థాయిలో విద్యుత్‌ను వినియోగించే పరిస్థితి ఏర్పడుతోంది. అమెరికాలోని టెన్నెస్సీ రాష్ట్రం మెంఫిస్ నగరంలో ఉన్న 'కొలాసస్-2' డేటా సెంటర్ ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. కృత్రిమ మేధ రంగంపై పరిశోధనలు చేసే 'ఎపోక్ ఏఐ' సంస్థ సేకరించిన గణాంకాల ప్రకారం, తమ డేటాసెట్‌లో నమోదైన ప్రస్తుతం పనిచేస్తున్న ఏఐ కేంద్రాల్లో ఇదే అతిపెద్దది. దీని అంచనా కంప్యూటింగ్ విద్యుత్ సామర్థ్యం 946 మెగావాట్లు. అంటే దాదాపు ఒక గిగావాట్‌కు సమానం.



లాగౌట్.. వాట్సాప్ వెబ్

బ్రౌజర్ మూసినా లాగౌట్ కాదు

మీ చాటింగ్‌లు ఇతరుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం

ప్రతి సెషన్ తర్వాత లాగౌట్ కావాల్సిందే: కేంద్రం

పబ్లిక్ కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ వాడొద్దని సూచన

న్యూఢిల్లీ, నవంబర్ 23: కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో వాట్సాప్ వెబ్ ఉపయోగించే వారికి కేంద్ర హోంశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. వాట్సాప్ వెబ్‌లో పని పూర్తయిన తర్వాత లాగౌట్ కాకుండా పదిలేస్తే వ్యక్తిగత చాటింగ్‌లు, కాంటాక్టుల వివరాలు సైబర్ తరువాయి 2 వ పేజీలో...

'ధురంధర్'కు అవార్డుల పంట

ఉత్తమ నటుడిగా రణ్‌వీర్ సింగ్.. ఉత్తమ దర్శకుడిగా ఆదిత్య ధర్

దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్-2026లో 'ధురంధర్' చిత్రం సత్తా చాటింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు వంటి కీలక విభాగాల్లో అవార్డులు అందుకుంది. నవంబర్ 20న ముంబయిలో నిర్వహించిన ఈ వేడుకలో భారతీయ, అంతర్జాతీయ సినీ రంగాలకు చెందిన పలువురు కళాకారులను సత్కరించారు. 'ధురంధర్'లో నటనకు రణ్‌వీర్ సింగ్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అదే చిత్రానికి దర్శకత్వం వహించిన ఆదిత్య ధర్ ఉత్తమ దర్శకుడి అవార్డు అందుకున్నారు. ఉత్తమ చిత్రంగా కూడా 'ధురంధర్' నిలిచింది. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా నటించిన అక్షయ్ ఖన్నాకు బెస్ట్ యాక్టర్ ఇన్ నెగటివ్ రోల్ పురస్కారం లభించింది.



ఈవార్తలు, వినోదవాణి: 'సైయారా' చిత్రంలో నటనకు అనీత్ పడ్డా ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'కాంతార: చాప్టర్ 1' క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్ అవార్డు అందుకోగా, రిషబ్ శెట్టి క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్‌గా నిలిచారు. 'హక్' చిత్రంలో నటనకు యామీ గౌతమ్ ధర్ క్రిటిక్స్ బెస్ట్ యాక్ట్రెస్ పురస్కారం అందుకున్నారు. 'ఛావా' చిత్రానికి వినీత్ కుమార్ సింగ్ ఉత్తమ సహాయ నటుడిగా, 'హౌస్‌ఫుల్ 5'కు రితేశ్ దేశ్‌ముఖ్ ఉత్తమ హాస్య నటుడిగా ఎంపికయ్యారు. ఓటీటీ విభాగంలో 'పాతాళ్ లోక్ 2'కు జైదీప్ అహ్లావత్ ఉత్తమ నటుడిగా, 'ఢిల్లీ క్రైమ్ 3'కు షెఫాలీ షా ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. అదే సిరీస్‌లో నెగటివ్ పాత్రకు హ్యూమా ఖురేషీతరువాయి 2 వ పేజీలో...

బ్యాంకు ఖాతాదారుడి చేతిలో 'స్టాప్ స్విచ్'

ఖాతా నుంచి డబ్బు బదిలీని వెంటనే ఆపేలా ఆర్బీఐ ప్రతిపాదన

నిర్దేశిత పరిమితి దాటితే నమ్మకమైన వ్యక్తి ఆమోదం కోరే వెసులుబాటు

2027 జులై 1 నుంచి అమలుకు బ్యాంకులకు సూచన



న్యూఢిల్లీ: డిజిటల్ మోసం జరుగుతోందని అనుమానం వచ్చిన వెంటనే తన ఖాతా నుంచి డబ్బు బదిలీని ఖాతాదారుడే ఆపేలా 'స్టాప్ స్విచ్' సదుపాయాన్ని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ప్రతిపాదించింది. బ్యాంకులు ఈ సదుపాయాన్ని తప్పనిసరిగా అందించాలని ముసాయిదా నిబంధనల్లో పేర్కొంది. దీంతోపాటు తాను నిర్ణయించుకున్న పరిమితికి మించి డబ్బు బదిలీ చేసేటప్పుడు, నమ్మకమైన వ్యక్తి ఆమోదం తీసుకునే అవకాశాన్ని కూడా ఖాతాదారుడికితరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

24.11.2026

మేషం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలు కొంత మందకొడిగా సాగుతాయి.

వృషభం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావు. ఇంటా బయట కొందరి ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

మిథునం: బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారస్తులకు అధికారులతో చిన్నపాటి వివాదాలు కలగుతాయి.

కర్కాటకం: కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. పాత బాకీలు వసూలు అవుతాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయ పడతారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

సింహం: వ్యాపారాలలో నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. ముఖ్యమైన పనులలో తొందరపాటు మంచిది కాదు. నిరుద్యోగులకు కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇంటా బయట పని ఒత్తిడి అధికమై సమయానికి నిద్రహారాలు ఉండవు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు ధనపరంగా మాట ఇచ్చే విషయంలో కొంత ఆలోచించి ముందుకు సాగడం మంచిది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

తుల: వ్యాపార వ్యవహారాలు కొంత నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. నూతన కార్యక్రమాలు ప్రారంభించక పోవడం మంచిది. జీవిత భాగస్వామితో అకారణంగా మాటపట్టింపులు ఉంటాయి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఇంటా బయట మీ మాటకు విలువ తగ్గుతుంది.

వృశ్చికం: నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు అనుకూలించవు. వృధా ఖర్చుల విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఆశించిన ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు విస్తరించి నూతన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులు అధికారుల అండదండలతో నూతన అవకాశాలు పొందుతారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మకరం: నూతన ఋణ ప్రయత్నాలు చెయ్యకపోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధన పరంగా ఒడిదుడుకులు అధికమౌతాయి. దీర్ఘకాలిక ఋణాల ఒత్తిడి కొంత పెరుగుతుంది.

కుంభం: ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. మిత్రుల నుండి ఆశించిన ధన సహాయం పొందుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. కుటుంబ సమస్యలు రాజీ చేసుకుంటారు. ఉద్యోగమున ఆశించిన మార్పులు ఉంటాయి.

మీనం: ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలకు వెళ్ళకపోవడం మంచిది. వ్యాపారాల్లో నూతన విధానాలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. దూర ప్రయాణాలలో తొందరపాటు మంచిది కాదు.

మంథనికి దుద్దిళ్ల గుడ్‌బై!?



మొదటి పేజీ తరువాయి

మారవచ్చనే చర్చ వినిపిస్తోంది.

మంథని నియోజకవర్గంలో దాదాపు ఐదు దశాబ్దాలుగా దుద్దిళ్ల కుటుంబం రాజకీయ ఆధిపత్యం కొనసాగిస్తున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ప్రత్యర్థి వర్గాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, డబ్బులతో ఓటర్లను ప్రభావితం చేయడం, అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం దుద్దిళ్ల కుటుంబానికి అలవాటుగా మారిందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 2023 ఎన్నికల్లో శ్రీధర్‌బాబు గెలిచిన తర్వాత ఆయనతో పాటు సోదరుల వ్యవహారశైలిపై సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనే అసంతృప్తి పెరిగినట్లు సమాచారం. తమ మాటకు విలువ ఇవ్వడం లేదని, సామాన్య కార్యకర్తలు సమస్యలు చెప్పుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ధన్వాడలో కార్యకర్తలకు హెచ్చరికలు?

దాదాపు 15 రోజుల క్రితం మంత్రిని నమ్ముకుని పనిచేసిన కొందరు నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ధన్వాడలోని ఆయన నివాసానికి వెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రశ్నించడంతో మంత్రి తీవ్రంగా స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. 'ఉంటే ఉండండి.. లేకపోతే లేదు' అంటూ హెచ్చరించారని, ఎవరినీ వదిలిపెట్టబోనని వ్యాఖ్యానించినట్లు సొంత మండలానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు బహిరంగంగా చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. గతంలో ముత్తారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన పోతిరెడ్డి కిషన్‌రెడ్డికి సంబంధించిన వివాదాన్ని కూడా కొందరు కార్యకర్తలు గుర్తుచేసుకుంటున్నారు. ఆయన ఇంట్లో గంజాయి పెట్టించి పోలీసులకు సమాచారం ఇచ్చి ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయని చెబుతున్నారు. ఈ వ్యవహారం కేసుల వరకు వెళ్లిందని, ఇలాంటి గత పరిణామాల కారణంగానే కొందరు కార్యకర్తలు మంత్రి కుటుంబానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు భయపడుతున్నారనే ప్రచారం ఉంది.

'డబ్బులు తీసుకోలేదా?' అంటూ నిలదీత?

మంత్రి సోదరుడు శ్రీనుబాబు వ్యవహారశైలిపైనా కాంగ్రెస్ కార్యకర్తల్లో అసంతృప్తి ఉన్నట్లు సమాచారం. ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజలను ఉద్దేశించి 'మాకు ఓట్లు ఊరికే వేశారా? డబ్బులు తీసుకోలేదా?' అంటూ ఆయన బహిరంగంగా ప్రశ్నించినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇటువంటి వ్యాఖ్యలతో కార్యకర్తలు, ప్రజలు మనస్తాపానికి గురై దుద్దిళ్ల కుటుంబానికి దూరంగా ఉంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనులు పూర్తి చేయకుండా శంకుస్థాపనలు, ఫొటోలు, సభల్లో ప్రసంగాలకే పరిమితమవుతున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. 'ఇప్పటివరకు ట్రైలర్ మాత్రమే చూశారు.. అసలు సినిమా ముందుంది' అంటూ మంత్రి చేసే వ్యాఖ్యలను కూడా ప్రత్యర్థి వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. మాటలు తప్ప పనులు కనిపించడం లేదని ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆ వర్గాలు చెబుతున్నాయి.

పుట్ట మధుతో పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి

మంథనిలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఆయన సతీమణి ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తుండటం శ్రీధర్‌బాబుకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతోందనే చర్చ సాగుతోంది. దుద్దిళ్ల కుటుంబ రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తూ పుట్ట మధు దంపతులు ప్రజల్లోకి వెళ్తున్నారని వారి అనుచరులు పేర్కొంటున్నారు. మంథని నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బీసీ నాయకుడైన పుట్ట మధు, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కావడంతో ప్రజల కష్టాలు ఆయనకు బాగా తెలుసని మద్దతుదారులు చెబుతున్నారు. ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని, ప్రస్తుతం కూడా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని పేర్కొంటున్నారు. దుద్దిళ్ల కుటుంబ వ్యవహారశైలిని ప్రశ్నిస్తూ పుట్ట మధు ప్రజల్లో ఆదరణ పెంచుకుంటున్నారని, ఈ పరిణామాలు శ్రీధర్‌బాబును రాజకీయంగా ఆందోళనకు గురిచేస్తున్నాయనే ప్రచారం వినిపిస్తోంది. మంథనిలో పుట్ట మధుకు పెరుగుతున్న మద్దతును దృష్టిలో పెట్టుకునే శ్రీధర్‌బాబు మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం వైపు చూస్తున్నారని ప్రత్యర్థి వర్గాలు చెబుతున్నాయి.

సీఎం సర్వేల్లోనూ ప్రతికూల నివేదికలు?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన మూడు సర్వేల్లోనూ శ్రీధర్‌బాబు పనితీరుపై ప్రతికూల నివేదికలు వచ్చాయనే ప్రచారం గాంధీభవన్ వర్గాల్లో వినిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన మరో మంత్రితో పోల్చినా శ్రీధర్‌బాబుకు ప్రజల్లో ఆదరణ తక్కువగా ఉందని ఆ సర్వేల్లో తేలినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న శ్రీధర్‌బాబు మంథనికి గుడ్‌బై చెప్పి మల్కాజిగిరి వైపు వెళ్లాలని ఆలోచిస్తున్నారనే సమాచారం ప్రచారంలో ఉంది. ఇటీవల ఓ కార్పొరేషన్ చైర్మన్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లోనూ శ్రీధర్‌బాబు నియోజకవర్గం మారే ఆలోచనలో ఉన్నట్లు వ్యాఖ్యానించారనే ప్రచారం జరుగుతోంది.

2028లో మళ్లీ 2014 సీన్?

వచ్చే ఎన్నికల్లో మంథని రాజకీయ ముఖచిత్రం మారబోతోందని ప్రత్యర్థి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. దుద్దిళ్ల కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి తెరపడే సమయం వచ్చిందని కొందరు వ్యాఖ్యానిస్తుండగా, శ్రీధర్‌బాబు మంథనిలోనే పోటీ చేసి ప్రజా తీర్పును ఎదుర్కోవాలని మరికొందరు అంటున్నారు. శ్రీధర్‌బాబు నియోజకవర్గం మారితే మంథనిలో తమకు రాజకీయంగా మరింత అవకాశం లభిస్తుందని పుట్ట మధు అనుచరులు భావిస్తున్నారు. 2014 ఎన్నికల ఫలితం మరోసారి పునరావృతమవుతుందని, బీఆర్ఎస్ అభ్యర్థిగా పుట్ట మధు మళ్లీ గెలుస్తారని ఆయన మద్దతుదారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంథనిలో పెరుగుతున్న రాజకీయ చర్చలు, సొంత పార్టీ అసంతృప్తి, ప్రతిపక్షాల దూకుడు నేపథ్యంలో శ్రీధర్‌బాబు మంథనిలోనే కొనసాగుతారా? లేక మల్కాజిగిరి వైపు మకాం మార్చుతారా? అన్నది ఇప్పుడు స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

పల్నాడు పాపం కేసీఆర్‌దే

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రాజెక్టుకు జీవో ఇచ్చినట్లు గుర్తుచేశారు. 2024లోపు పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నాందని తెలిపారు. ఆ సమయంలో తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఈ ప్రాజెక్టుపై ఒక్కసారి కూడా అభ్యంతరం చెప్పలేదని విమర్శించారు. తెలంగాణలో తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశం తమ దృష్టికి రావడంతో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారని వివరించారు.

హరీశ్‌రావుపై విమర్శలు

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యం పెంపు విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాత్ర ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2005 సెప్టెంబరులో జీవో నంబర్ 170 విడుదలయ్యే సమయానికి తాను మంత్రిగా లేనని హరీశ్‌రావు చెబుతున్నారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అయితే అదే ఏడాది మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని.. బడ్జెట్‌కు అప్పటి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఆ సమయంలో హరీశ్‌రావుతో పాటు మరో ఐదుగురు బీఆర్ఎస్ నేతలు మంత్రులుగా ఉన్నారని గుర్తుచేశారు. హరీశ్‌రావుకు అసలైన గురువు కేసీఆర్ కాదని.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. వైఎస్సార్ హయాంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపునకు హరీశ్‌రావు మద్దతు ఇచ్చారని.. హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీల నీటిని తరలించేందుకు అనుమతులు వచ్చిన సమయంలోనూ అభ్యంతరం చెప్పలేదని ఆరోపించారు.

తెలంగాణ నీటి వాటాపై కేసీఆర్ సంతకాలు చేశారని ఆరోపణ

కృష్ణా జలాల పంపిణీలోనూ కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేశారని రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా తెలంగాణకు 575 టీఎంసీలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ 2015 జూన్ 26వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో ఏపీకి 512 టీఎంసీలు.. తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని కేసీఆర్ సంతకం చేశారని ఆరోపించారు. 2020 జనవరి 29వ తేదీన కూడా ఏపీకి 512 టీఎంసీలు కేటాయించేలా శాశ్వత ఒప్పందం చేసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ నిర్ణయాల వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర నష్టం జరిగిందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అప్పటి ప్రభుత్వంపై ఉన్నప్పటికీ.. ఆ దిశగా కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరించలేదని మండిపడ్డారు.

1,480 పాయింట్లు పతనం

మొదటి పేజీ తరువాయి

సూచీలు దాదాపు 2 శాతం మేర భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 1,483.72 పాయింట్లు (1.77 శాతం) కుప్పకూలి 82,435.99 వద్ద ముగియగా, నిఫ్టీ 450.95 పాయింట్లు (1.75 శాతం) క్షీణించి 25,349.65 వద్ద స్థిరపడింది. ముఖ్యంగా టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి హెవీవెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి ప్రధాన కారణమైంది. కమొడిటీ సంబంధిత షేర్ల నుంచి ఇన్వెస్టర్లు వైదొలగడంతో రంగాల వారీగా నిఫ్టీ మెటల్ అత్యధికంగా నష్టపోయింది. బ్యాంకింగ్, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు ఆటోమొబైల్ సూచీలు కూడా భారీగా నష్టపోయాయి. విస్తృత మార్కెట్లోనూ అమ్మకాల సెగ తగిలింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.01 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.66 శాతం మేర పతనమయ్యాయి. ఐటీ షేర్లు మాత్రం లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 2 శాతం పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బబుల్ భయాలు, అమెరికా కఠిన ద్రవ్య విధానాల వల్ల గత వారం చివర్లో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన అమ్మకాల ప్రభావం భారత ఈక్విటీలపై పడిందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) బలహీన సెంటిమెంట్, ఇటీవల ర్యాలీ తర్వాత ప్రాఫిట్ బుకింగ్ కారణంగా సూచీలు పతనమైనట్లు తెలిపారు. అయితే తయారీ రంగ వృద్ధి, రెండో త్రైమాసికంలో 7.7 శాతం జీడీపీ వృద్ధి అంచనాలు దీర్ఘకాలికంగా మార్కెట్‌కు బలమైన మద్దతుగా నిలుస్తాయని నిపుణులు భరోసా వ్యక్తం చేశారు.

'ధురంధర్'కు అవార్డుల పంట

మొదటి పేజీ తరువాయి

గుర్తింపు పొందారు. అంతర్జాతీయ విభాగంలో 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. 'సిన్నర్స్'కు మైఖేల్ బి. జోర్డాన్ ఉత్తమ నటుడిగా, 'హ్యామ్‌నెట్'కు జెస్సీ బక్లీ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. సంగీత విభాగంలో 'సైయారా' టైటిల్ సాంగ్‌కు సాంగ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కింది. 'ధురంధర్'కు శాశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఫహీమ్ అబ్దుల్లా ఉత్తమ నేపథ్య గాయకుడిగా, ఇర్షాద్ కామిల్ ఉత్తమ గేయ రచయితగా అవార్డులు అందుకున్నారు. సంగీత రంగానికి చేసిన సేవలకు ఇళయరాజాను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ పురస్కారాలు దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ సంస్థకు సంబంధించినవి. కేంద్ర ప్రభుత్వం అందించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఇవి వేరు.

బండి గుండె చప్పుడు వేరయా..!

మొదటి పేజీ తరువాయి

సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ ఎక్కడ ఉందని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నేతలను ఉద్దేశిస్తూ, కరీంనగర్ తన కాషాయ అడ్డా అని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు కనిపించాయి. నినాదాలకు బదులుగా అభివృద్ధి, ప్రాజెక్టులు, నిధుల అంశాలపైనే ప్రజలు తీర్పునిస్తారని విమర్శిస్తున్నారు.

మేడిగడ్డ ఉన్నది కరీంనగర్‌లో..?

మొదటి పేజీ తరువాయి

భూపాలపల్లి జిల్లా, మహదేవపూర్ మండలం, మేడిగడ్డ గ్రామం వద్ద గోదావరి నదిపై ఉంది. మేడిగడ్డ ఏ జిల్లాలో ఉందో కూడా తెలియదా? అని సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లాగౌట్.. వాట్సాప్ వెబ్

మొదటి పేజీ తరువాయి

నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని అప్రమత్తం చేసింది. ముఖ్యంగా కార్యాలయాలు, సైబర్ కేఫ్‌లు, ఇతరులు ఉపయోగించే కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ప్రమాదకరమని పేర్కొంది. కేవలం బ్రౌజర్ ట్యాబ్ మూసివేసినంత మాత్రాన వాట్సాప్ వెబ్ నుంచి లాగౌట్ అయినట్లు కాదని స్పష్టం చేసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)కు చెందిన నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్ (ఎన్‌సీటీఏయూ) ఈ మేరకు భద్రతా సూచనలు జారీ చేసింది. నవంబర్ 18న రూపొందించిన ఈ అడ్వైజరీ వివరాలు సోమవారం వెలుగులోకి వచ్చాయి. వాట్సాప్ వెబ్‌లో ఇప్పటికే లాగిన్ అయి ఉన్న సెషన్లను కొన్ని పరిస్థితుల్లో ఇతరులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. సాధారణంగా చాలామంది కంప్యూటర్‌లో వాట్సాప్ వెబ్ ఉపయోగించిన తర్వాత పని పూర్తయిందని బ్రౌజర్ ట్యాబ్‌ను మూసివేస్తుంటారు. కొందరు కంప్యూటర్‌ను షట్‌డౌన్ చేసినా తమ ఖాతా సురక్షితంగా ఉందని భావిస్తారు. అయితే ట్యాబ్ మూసివేయడం, కంప్యూటర్ ఆఫ్ చేయడం వల్ల వాట్సాప్ వెబ్ సెషన్ తప్పనిసరిగా ముగిసిపోదు.

పప్పూ.. డ్రామాలు ఆపు

మొదటి పేజీ తరువాయి

ఈ దేశ ప్రధానమంత్రిని, రాష్ట్రాల ముఖ్యమంత్రులను నిర్ణయించే అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. సోమవారం కరీంనగర్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొన్న మహా పాదయాత్రలో బండి సంజయ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్‌లో కాషాయ దళం ఉత్సాహాన్ని చూస్తుంటే తన మనసు పులకరిస్తోందని బండి సంజయ్ అన్నారు. తనను కన్న కరీంనగర్ గడ్డపై బీజేపీ కార్యకర్తల స్పందన చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. నితిన్ నబీన్ కరీంనగర్‌లో అడుగుపెట్టడంతో తన గుండె ఉప్పొంగుతోందని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం భుజాన కాషాయ జెండా వేసుకుని తెగించి పోరాడేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ఎక్కడ ఉందని ప్రశ్నించే కాంగ్రెస్ నేతలు కరీంనగర్‌కు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను రాజకీయంగా ఎదుర్కొనేందుకు బీజేపీ శ్రేణులు ఎంత ఉత్సాహంగా ఉన్నాయో మహా పాదయాత్రే నిరూపిస్తోందన్నారు. కరీంనగర్ తన కాషాయ అడ్డా అని తొడగొట్టి చెప్పాలనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

బ్యాంకు ఖాతాదారుడి చేతిలో 'స్టాప్ స్విచ్'

మొదటి పేజీ తరువాయి

కల్పించాలని సూచించింది. ఖాతాదారుడు స్టాప్ స్విచ్‌ను ఆన్ చేసిన వెంటనే ఆ ఖాతా నుంచి కొత్తగా జరిగే డెబిట్ లావాదేవీలు నిలిచిపోతాయి. అయితే, గతంలోనే అనుమతి ఇచ్చిన రికరింగ్ పేమెంట్లు, స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ కింద జరిగే చెల్లింపులు కొనసాగుతాయి. రుణాల ఈఎంఐలు, బ్యాంకు ఛార్జీల వసూళ్లకూ మినహాయింపు ఉంటుంది.'ట్రస్టెడ్ పర్సన్' సదుపాయాన్ని ఎంచుకోవాలా వద్దా అనేది ఖాతాదారుడి ఇష్టం. దీన్ని ఎంచుకుంటే తనకు నమ్మకమైన వ్యక్తి పేరును బ్యాంకులో నమోదు చేసి, ఎంత మొత్తం దాటితే ఆ వ్యక్తి ఆమోదం తీసుకోవాలో నిర్ణయించుకోవచ్చు. ఆ పరిమితికి మించి బదిలీకి ప్రయత్నించినప్పుడు బ్యాంకు ఆ వ్యక్తికి నోటిఫికేషన్ పంపుతుంది. అందులో బదిలీ మొత్తం, డబ్బు అందుకునే వ్యక్తి పేరు, ఖాతా నంబరు, మొబైల్ నంబరు వంటి వివరాలు ఉంటాయి. నోటిఫికేషన్ అందిన గంటలోపు ఆ వ్యక్తి ఆమోదం తెలిపితేనే బదిలీ పూర్తవుతుంది. తిరస్కరించినా, గంటలోపు స్పందించకపోయినా లావాదేవీ రద్దవుతుంది. ఎంపికైన వ్యక్తికి ఖాతాపై నియంత్రణ ఉండదు. లావాదేవీలకు సంబంధించి చట్టపరమైన బాధ్యత కూడా ఉండదు.

చుక్క నీళ్లివ్వం

మొదటి పేజీ తరువాయి

సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఈఎన్‌సీలు రమేష్‌బాబు, నరసింహమూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా తాగునీటి అవసరాలకు మరో 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నెల 25వ తేదీ నుంచి మూడు నెలల పాటు నీటిని అందించాలని కోరింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం జిల్లాల అవసరాల కోసం కుడి కాల్వ నుంచి.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల అవసరాల కోసం ఎడమ కాల్వ నుంచి నీటిని కేటాయించాలని ఏపీ ప్రభుత్వ అధికారులు కేఆర్ఎంబీని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన అదనపు నీటి డిమాండ్‌ను తెలంగాణ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పటికే తనకు కేటాయించిన వాటా కంటే ఎక్కువ కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుందని వాదించింది. ఈ పరిస్థితుల్లో మరోసారి అదనపు నీటిని కేటాయించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అదనంగా కోరిన 10 టీఎంసీల్లో చుక్క నీరు కూడా ఇచ్చేందుకు అంగీకరించబోమని తేల్చిచెప్పింది. మరోవైపు.. రానున్న 3 నెలల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణకు 30 టీఎంసీల నీరు అవసరమని రాష్ట్ర అధికారులు కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీకి తెలిపారు. కృష్ణా జలాల నీటి పంపకాలపై రెండు రాష్ట్రాల వాదనలు, ప్రతిపాదనలతో త్రిసభ్య కమిటీ సమావేశం వాడీవేడిగా సాగింది.

జెన్సన్ హువాంగ్ ఈజీ బ్యాక్

మొదటి పేజీ తరువాయి

వార్తల నేపథ్యంలో పదవి నుంచి వైదొలిగిన ఎన్విడియా కో ఫౌండర్ జెన్సన్ హువాంగ్ మళ్లీ కంపెనీ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. జెన్సన్ హువాంగ్‌ను తిరిగి ఎన్విడియా అధ్యక్షుడు, సీఈఓ, బోర్డు డైరెక్టర్‌గా నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. మరోవైపు.. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుందని సంస్థ స్పష్టం చేసింది. ఎన్విడియా సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. జెన్సన్ హువాంగ్‌తో పలుమార్లు చర్చలు, సమావేశాలు నిర్వహించిన తర్వాత ఆయన నాయకత్వ సామర్థ్యం, బోర్డుతో వ్యవహరించిన తీరు పట్ల సంతృప్తి చెందినట్లు కంపెనీ డైరెక్టర్లు తెలిపారు. దీంతో ఆయనను తక్షణమే తిరిగి బాధ్యతల్లోకి తీసుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు అమెరికా ప్రభుత్వంలోని ఉన్నతస్థాయి అధికారుల నుంచి కూడా బోర్డు అభిప్రాయాలు తీసుకున్నట్లు కంపెన

లొంగిపోయిన మావోయిస్టులకు రూ.5.59 కోట్లు

214 మందికి పునరావాస ప్రోత్సాహకాలు

విడుదల 2024 నుంచి ఇప్పటివరకు

824 మంది లొంగుబాటు

659 మందికి రూ.17.68 కోట్లు

అందించిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లొంగిపోయిన 214 మంది మాజీ మావోయిస్టులకు రూ.5.59 కోట్ల నగదు ప్రోత్సాహకాలను సోమవారం విడుదల చేసింది. ఆయుధాలు వదిలి సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకున్నవారికి పునరావాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 అక్టోబర్ 21న మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారని డీజీపీ గుర్తుచేశారు. ఆ తర్వాత లొంగుబాట్లు పెరిగాయని పేర్కొన్నారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 824 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు వెల్లడించారు. వీరిలో తెలంగాణకు చెందినవారు 59 మంది, ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు 754 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు తొమ్మిది మంది ఉన్నారు. మహారాష్ట్ర, ఒడిశా నుంచి ఒక్కొక్కరు చొప్పున లొంగిపోయారు. లొంగిపోయినవారిలో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ సభ్యులతో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు, పార్టీ సభ్యులు, మిలీషియా సిబ్బంది ఉన్నారని తెలిపారు. తాజాగా విడుదల చేసిన ప్రోత్సాహకాలతో కలిపి ఇప్పటివరకు 659 మందికి రూ.17.68 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 96 మంది అర్హులు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాల్సి ఉందని తెలిపారు. ఆ వివరాలు అందిన వెంటనే వారికి మంజూరైన పునరావాస నిధులను విడుదల చేస్తామని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు సమాజంలో తిరిగి స్థిరపడేందుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని డీజీపీ తెలిపారు.





కర్రెగుట్టల్లో ఇంకా మందుపాతరలు

పర్యాటకులకు ఇప్పుడే అనుమతి లేదన్న డీజీపీ సీవీ ఆనంద్

తొమ్మిది డంప్‌ల నుంచి 252 తుపాకులు స్వాధీనం

పూర్తిస్థాయిలో క్లియరెన్స్ వచ్చిన తర్వాతే అనుమతి

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఇంకా మందుపాతరల ప్రమాదం పొంచి ఉందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రస్తుతం ఆ ప్రాంతంలోకి పర్యాటకులను అనుమతించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించి మందుపాతరలను తొలగించిన తర్వాతే పర్యాటకుల రాకకు అనుమతి ఇస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీ అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మందుపాతరలను అమర్చారని డీజీపీ తెలిపారు. ముఖ్యంగా ప్రెషర్ మైన్ల ప్రమాదం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అవి ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై ఇంకా పూర్తిస్థాయి సమాచారం లేదని వివరించారు. లొంగిపోయిన కొందరు మావోయిస్టులను విచారించడంతో తొమ్మిది డంప్‌లను గుర్తించినట్లు తెలిపారు. వీటి నుంచి 252 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వం కర్రెగుట్ట ప్రాంత అభివృద్ధికి చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజల భద్రతకే మొదటి ప్రాధాన్యం ఇస్తామని డీజీపీ స్పష్టం చేశారు. మందుపాతరలను పూర్తిగా తొలగించి భద్రతాపరమైన క్లియరెన్స్ వచ్చిన తర్వాతే పర్యాటకులను అనుమతిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లొంగిపోయిన 214 మంది మాజీ మావోయిస్టులకు రూ.5.59 కోట్ల నగదు ప్రోత్సాహకాలు, పునరావాస సాయాన్ని అందజేశారు. హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చినవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

ఊహా ప్రపంచంలో కేటీఆర్

బీఆర్ఎస్‌కు అధికారం ఇక కలే: భట్టి



హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాస్తవాలను వదిలేసి ఊహా ప్రపంచంలో బతుకుతున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. కేటీఆర్ సోషల్ మీడియా లోకానికే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను గుర్తించడం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఇక కలేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడుతోందని భట్టి తెలిపారు. అయితే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను దెబ్బతీశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సరిదిద్దుతూ అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందిస్తోందని చెప్పారు. గతంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న ప్రచారాన్ని భట్టి విక్రమార్క ఖండించారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై కొత్త ఇన్‌చార్జితో చర్చించినట్లు తెలిపారు. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అలాంటప్పుడు విభేదాలపై చర్చ ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, నాయకుల మధ్య సమన్వయం పెంచడంపైనే సమావేశాల్లో చర్చిస్తున్నామని వివరించారు. అంతర్గత విభేదాలు ఉన్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

అబద్ధాల సీఎంకు ఆధారాలతో జవాబిస్తా

కృష్ణా జలాల వివాదంపై రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): కృష్ణా జలాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రతి ఆరోపణకు ఆధారాలతో సహా సమాధానం ఇస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రకటించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అసత్య ఆరోపణలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఎక్స్ వేదికగా స్పందించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని, ఆంధ్రప్రదేశ్ చేపట్టిన ప్రాజెక్టులకు సహకరించిందని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను హరీశ్‌రావు తప్పుబట్టారు. కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన ప్రతి ఆరోపణకు, ప్రతి అసత్య వ్యాఖ్యకు తగిన ఆధారాలతో సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. ఇందుకోసం మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో హరీశ్‌రావు ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు

80 వేల చదరపు మీటర్లలో మల్టీసెక్టార్ ఎక్స్‌పో

వెయ్యికి పైగా దేశవిదేశీ కంపెనీల ప్రతినిధులకు ఆహ్వానం

ఎయిర్ షో, క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు భారీ ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజులపాటు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. సుమారు 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో మల్టీసెక్టార్ ఎక్స్‌పో ఏర్పాటు చేయనున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లపై సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశవిదేశాల నుంచి వెయ్యికి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సదస్సు ప్రాంగ ణంలో వేదికలు, వివిధ రంగాల ప్రదర్శన శాలలు, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, రవాణా, భద్రత, ఇతర సదుపాయాలపై సమీక్షించారు. సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ఆధారంగా ప్రవేశం కల్పించాలని సీఎం సూచించారు. విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అతిథులతో మర్యాదగా వ్యవహరి ంచేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్ వంటి కార్యక్రమాలను నిర్వహిం చనున్నారు. సమ్మిట్‌లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాకతీయుల శిల్పకళ, సమ్మక్క-సారలమ్మ ఆలయ తోరణాల నమూనాలు, సోమశిల ఆలయం, నిర్మల్ పెయింటింగ్స్, భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, నేతన్నల కళా వైభవాన్ని తెలియజేసేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలతో పాటు భవిష్యత్తు ప్రాజెక్టుగా ప్రతి పాదించిన గాంధీ సరోవర్ వివరాలను కూడా ప్రదర్శించనున్నారు.

ఇందిరమ్మ టవర్స్‌కు రేరా గ్రీన్‌సిగ్నల్

తొలి విడతలో మలక్‌పేట, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టులకు అనుమతులు

రూ.30-50 లక్షల విలువైన ఫ్లాట్లు

పేదలకు రూ.6 లక్షలకే

హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 వేల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక



హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): అల్పాదాయ వర్గాల ప్రజలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో తెలంగాణ హౌసింగ్ బోర్డు చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ గృహ నిర్మాణ ప్రాజెక్టులకు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) అనుమతులు లభించాయి. తొలి దశలో మలక్‌పేట, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు రేరా గుర్తింపు వచ్చింది. సోమవారం రేరా ఛైర్మన్ శ్రీనివాసరాజు నుంచి హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతం అనుమతి పత్రాలను అందుకున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న హౌసింగ్ బోర్డు గృహ నిర్మాణ ప్రాజెక్టులకు రేరా అనుమతులు రావడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ పనుల్లో పారదర్శకత, నాణ్యత, నిర్దిష్ట గడువులో నిర్మాణాల పూర్తికి ఈ గుర్తింపు దోహదపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలో లక్ష ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి విడతలో 20 నియోజకవర్గాల్లో దాదాపు 12 వేల ఇళ్ల నిర్మాణాలను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూములను ప్రభుత్వం ఉచితంగా అందించడంతో పాటు లబ్ధిదారులకు ఫ్లాట్లతోపాటు అవిభక్త భూమి వాటాను కూడా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని నిర్ణయించింది. నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విలువ చేసే ఫ్లాట్లను అర్హులైన పేదలకు రూ.6 లక్షలకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సమస్యలు చెప్తే.. నిరసనలపై నిషేధమా?

కేటీఆర్ పర్యటన మరుసటి రోజే కరీంనగర్ మెడికల్ కాలేజీలో సర్క్యులర్

అనధికార ఆందోళనలు చేపడితే చర్యలంటూ ప్రిన్సిపాల్ హెచ్చరిక

కరీంనగర్, నవంబర్ 23 (ఈవార్తలు): మెడికల్ కాలేజీ భవనం, హాస్టల్ నిర్మాణ పనుల్లో జాప్యంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కళాశాల యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకున్న మరుసటి రోజే ఆసుపత్రి ప్రాంగణంలో అనధికార నిరసనలు, ప్రదర్శనలు నిర్వహిం చరాదంటూ ప్రిన్సిపాల్ ఆదేశాలు జారీ చేయ డంపై విద్యార్థులు మండిపడుతున్నారు. నవం బర్ 22న కరీంనగర్ పర్యటనకు వచ్చిన కేటీఆర్ మెడికల్ కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులను కలిశారు. కళాశాల భవనం, హాస్టల్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బం దులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు ఫోన్ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. భవన నిర్మాణం, హాస్టల్ పనుల్లో జాప్యాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. అయితే మరుసటి రోజే కళాశాల, ఆసుపత్రి ప్రాంగణాల్లో, పరిసర ప్రాంతాల్లో అనధికార ఆందోళనలు, ప్రదర్శనలు నిషేధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సర్క్యులర్ విడుదల చేసినట్లు సమాచారం. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళాశాల భవనం, హాస్టల్ పనులు పూర్తి చేయాలని కోరితే సమస్యలను పరిష్కరించ కుండా హెచ్చరికలు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలను తెలియ జేసేందుకు నిరసన వ్యక్తం చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విదేశాల్లో 14,850 మందికి కొలువులు

16 దేశాల్లో ఉద్యోగాలు కల్పించిన టామ్‌కామ్

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటివరకు 16 దేశాల్లో 14,850 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. విదేశాల్లో ఉ ద్యోగాలు పొందినవారిలో 90 శాతం మంది మహిళలేనని తెలిపారు. విదేశీ ఉపాధి కల్పనలో టామ్‌కామ్ పనితీరును కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించిందని పేర్కొన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన జాతీయస్థాయి చింతన్ శిబిరంలో టామ్‌కామ్ పనితీరును కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రత్యేకంగా అభినందించినట్లు వివేక్ తెలిపారు. గల్ఫ్



దేశాలతో పాటు యూకే, జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్, కెనడా తదితర 16 దేశాల్లో తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. వైద్యం, నిర్మాణం, రవాణా సహా పది ప్రధాన రంగాల్లో కేంద్ర విదేశాంగ శాఖ గుర్తింపుతో నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్ కింద రూ.50 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాలకు ఎంపికైనవారికి వీసా, ప్రయాణ ఖర్చుల కోసం 50 శాతం ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. విదేశీ ఉద్యోగాలకు అవసరమైన భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు మరో రూ.20 కోట్లతో జర్మన్, జపనీస్, ఇంగ్లిష్ భాషల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) సహకారంతో ఆరు క్లస్టర్లలో జర్మన్ భాషా శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారిక జర్మన్ లాంగ్వేజ్ టెస్టింగ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811

నంబర్‌ను సంప్రదించవచ్చు.



కాంగ్రెస్‌లో ముఠా తగాదాల్లేవు: పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత విభేదాలు, ముఠా తగాదాలు లేవని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్‌ను సోమవారం గాంధీభవన్‌లో కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త ఇన్‌చార్జిని మర్యాదపూర్వకంగానే కలిశానని, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో అంతర్గత విభేదాల గురించి ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో నాయకుల మధ్య ముఠా తగాదాలు ఉన్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్ సోమవారం గాంధీభవన్‌లో పలువురు మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో విడివిడిగా చర్చించారు. నియోజకవర్గాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో పార్టీ పరిస్థితులు, స్థానిక నాయకుల మధ్య సమన్వయంపైనా దృష్టి సారించారు.

అగ్రి మహిళా ప్రొఫెసర్ అరెస్టు

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. తనకు న్యాయం చేయడంతో పాటు విశ్వవిద్యాలయంలో మహిళల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో సోమవారం దీక్ష చేపట్టిన ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. వైస్ ఛాన్సలర్ జానయ్యపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తేజశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోరుతున్న తనకు అన్యాయం జరుగుతోందని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పదవిలో కొనసాగించడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం తన ఫిర్యాదుపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో మహిళా ఉద్యోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని కోరారు. వీసీపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, విచారణ పూర్తయ్యే వరకు ఆయనను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.



హామీల అమలులో
కాంగ్రెస్ విఫలం: ఎల్. రమణ

జగిత్యాల, నవంబర్ 23 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ విమర్శించారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సోమవారం జగిత్యాలలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. గతంలో చేనేత కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా పింఛన్లు అందించారని, ఇప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలు కోరడం సరికాదన్నారు.



అయ్యప్ప స్వాములకు 51 రోజుల అన్నదానం

నవంబర్ 25 నుంచి జనవరి 14 వరకు ఉచిత భోజనం, అల్పాహారం

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): అయ్యప్ప మాలధారులకు 51 రోజుల పాటు ఉచితంగా అన్నదానం, అల్పాహారం అందించనున్నట్లు శ్రీ భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ప్రకటించింది. నవంబర్ 25 నుంచి జనవరి 14 వరకు ఉస్మాన్‌గంజ్‌లోని 'బాస్' కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు మేడిశెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శి భద్రేశ్వర్, కోశాధికారి సీఏ అనిల్ నాయర్ తెలిపారు. ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. గత పదేళ్లుగా అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పనుల కోసం నగరానికి వచ్చే అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు భోజనం, రాత్రి తొమ్మిది నుంచి పది గంటల వరకు అల్పాహారం ఉచితంగా అందజేస్తామని వివరించారు. నవంబర్ 25న రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అన్నదాన కమిటీ ప్రతినిధులు నార్ల జగదీష్‌గుప్తా, ఏ. అశోక్‌గుప్తా, కె. రాజేశ్వరరావు, ఎం. అంజన్‌రాజ్, ముజుకరి శ్రీనివాస్, నరేష్ పటేల్, కట్ట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చల్గల్‌కు కొనుగోలు కేంద్రం తరలించరా?

రైతులు పడిగాపులు కాస్తున్నా పట్టించుకోరా?: జీవన్‌రెడ్డి



జగిత్యాల, నవంబర్ 23 (ఈవార్తలు): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చల్గల్‌కు తరలించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. రైతులు ధాన్యం ట్రాక్టర్లతో రోడ్లపై పడిగాపులు కాస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సోమవారం జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడిన జీవన్‌రెడ్డి కొనుగోలు కేంద్రం తరలింపులో జరుగుతున్న జాప్యంపై నిలదీశారు. వ్యవసాయ మార్కెట్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ధాన్యం ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. చల్గల్‌కు మార్కెట్‌ను తరలించేందుకు అడ్డిదారులు ఒప్పుకోవడం లేదనే కారణం చెప్పడం సరికాదన్నారు. మార్కెట్ నిర్వహించేది రైతుల కోసమా, అడ్డిదారుల కోసమా అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చల్గల్‌కు తరలిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకటించి వారం రోజులు గడిచినా చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత మార్కెట్ అధికారులపై ఉందన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని చల్గల్‌కు తరలించి ధాన్యం తూకం ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



బూత్ ఏజెంట్లకు కీలక బాధ్యతలు: బండి రమేష్

కూకట్‌పల్లి, నవంబర్ 23 (ఈవార్తలు): ఓటర్ల హక్కుల పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. సోమవారం హేమదుర్గా భవన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలింగ్ బూతులవారీగా ఏజెంట్లకు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. తమకు కేటాయించిన పోలింగ్ బూతు పరిధిలో ఓటర్ల హక్కుల పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పార్టీ నియమించిన కోఆర్డినేటర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో వివిధ డివిజన్ల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను అమ్మనివ్వం: మాధవరం



కూకట్‌పల్లి, నవంబర్ 23 (ఈవార్తలు): కూకట్‌పల్లిలోని ట్రక్ పార్క్, హౌసింగ్ బోర్డు భూములను విక్రయించే హక్కు ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రజా అవసరాల కోసం గతంలో ప్రభుత్వానికి ఇచ్చిన భూములను వేలం వేయకుండా ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. భూముల పరిరక్షణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. ప్రభుత్వ భూముల విక్రయానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నవంబర్ 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్తులో కూకట్‌పల్లి జనాభా పది లక్షలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ భూములు అవసరమని పేర్కొన్నారు. ట్రక్ పార్క్‌లో వాహనాలను నిలిపి జీవనోపాధి పొందుతున్న పేదలకు భూముల విక్రయం వల్ల నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా భూములను అమ్మేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. ప్రజా ఆస్తులను కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీహెచ్‌పీలో సభ్యత్వం తీసుకోవాలి: బాలస్వామి



హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): కులాలు, ప్రాంతాలు, వర్గాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా హిందువులందరూ విశ్వహిందూ పరిషత్‌లో సభ్యత్వం తీసుకోవాలని వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి పిలుపునిచ్చారు. హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోగలమని అన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే విశ్వహిందూ పరిషత్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కులాలు, రాజకీయాల పేరుతో హిందువులు విడిపోకుండా ఐక్యంగా ముందుకు రావాలని బాలస్వామి కోరారు. హిందూ సమాజం సంఘటితంగా లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొందరు నాయకులు హిందూ సమాజ ప్రయోజనాలను విస్మరిస్తున్నారని విమర్శించారు. హిందువులు ఐక్యంగా ఉంటేనే సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్రదాడులు, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది మతం ఆధారంగా వ్యక్తులను గుర్తించి వారి కుటుంబ సభ్యుల ఎదుటే కాల్చిచంపిన ఘటన జరిగిందని పేర్కొంటూ, ఇటువంటి ఘటనలు హిందూ సమాజం సంఘటితంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయని అన్నారు. హిందూ సమాజంలో ధార్మిక చైతన్యం పెంపొందించడంతోపాటు మతమార్పిడులను అడ్డుకోవడం, గోహత్య నిషేధానికి కృషి చేయడం, దేవాలయాల పరిరక్షణ, వాటి వైభవ పునరుద్ధరణకు పాటుపడటం విశ్వహిందూ పరిషత్ లక్ష్యాలని వివరించారు. ప్రేమ పేరుతో మోసపూరిత సంబంధాల వల్ల హిందూ యువతులు నష్టపోకుండా అవగాహన కల్పించాలని కోరారు. మహిళల గౌరవం, భద్రత, ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కులాల పేరుతో హిందువుల మధ్య ఉన్న అంతరాలను తొలగించి సామాజిక సమరసత పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరినీ సోదరభావంతో గౌరవించాలన్నారు. సెక్యులరిజం పేరుతో హిందూ సమాజ ప్రయోజనాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. తమ హక్కులు, ధార్మిక స్వేచ్ఛ, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో సంఘటితంగా గళమెత్తాలని పిలుపునిచ్చారు. హిందూ సమాజ ఐక్యత, సామాజిక సమరసత, ధర్మరక్షణ, సేవా కార్యక్రమాలే వీహెచ్‌పీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ప్రతి హిందువు సభ్యత్వం తీసుకుని కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ కరీంనగర్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవి, నాయకులు సత్యనారాయణ, బొక్కి సాయిలు, సత్యప్ప, ఎంగలి సిద్దూ, బజరంగ్‌దళ్, గోరక్ష విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం

దళారులను ఆశ్రయించకుండా నేరుగా ధాన్యం విక్రయించాలి: పుల్కం రాజు



వేములవాడ అర్బన్, నవంబర్ 23 (ఈవార్తలు): రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సూచించారు. సోమవారం వేములవాడ పట్టణంలోని బాలనగర్ సెంటర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్యాక్స్ చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేములవాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి 17 శాతం తేమ నిబంధనకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ లభిస్తుందని, ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కౌన్సిలర్ కొండ రాజశేఖర్, ప్యాక్స్ డైరెక్టర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా స్వాతి

మంగళ్‌హాట్‌లో బీజేపీ నూతన కమిటీల నియామకం



హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): మంగళ్‌హాట్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా నూతన అధ్యక్షురాలిగా కొత్తూరు స్వాతి నియమితులయ్యారు. ధూల్‌పేటలోని ఆకాశ్‌పురి హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పి. కిషోర్‌కుమార్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమానికి గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు టి. ఉమా మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళ్‌హాట్ కార్పొరేటర్ ఎం. శశికళ, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అర్చన, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణ, సీనియర్ నాయకులు గోపిశెట్టి ప్రమోద్, పి. రవీందర్‌సింగ్, ఎస్. రాజన్‌కుమార్ పాల్గొన్నారు. నూతన అధ్యక్షురాలు స్వాతిని నాయకులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్వాతి తెలిపారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్ ఆదేశాల మేరకు మంగళ్‌హాట్ డివిజన్‌లో వివిధ మోర్చాలు, సెల్‌లకు నూతన అధ్యక్షులు, ఇన్‌చార్జిలను నియమించినట్లు డివిజన్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ ప్రకటించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా చుక్కా నవీన్‌కుమార్, యువమోర్చాకు అక్షయ్ షిండే, మహిళా మోర్చాకు యు. స్వాతి, ఎస్సీ మోర్చాకు గిరిప్రసాద్, కిసాన్ మోర్చాకు కృష్ణదాస్ నియమితులయ్యారు. ఐటీ సెల్‌కు రాజ్‌కుమార్, మీడియా సెల్‌కు ప్రదీప్‌సింగ్, మెడికల్ సెల్‌కు గణేష్ కుర్మ, సీనియర్ సిటిజన్ సెల్‌కు నర్సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. నూతనంగా నియమితులైన వారందరూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కిషోర్‌కుమార్ కోరారు.

నేతన్నల పింఛన్లలో అన్యాయం

2,400 దరఖాస్తులకు వంద మందికే మంజూరా?

జగిత్యాల కలెక్టరేట్ ఎదుట పద్మశాలీల నిరసన



జగిత్యాల, నవంబర్ 23 (ఈవార్తలు): అర్హులైన నేతన్నలకు పింఛన్లు మంజూరు చేయడంలో అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన నేతన్నలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 2,400 మంది నేతన్నలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం వంద మందికి మాత్రమే మంజూరు చేశారని సంఘం నాయకులు ఆరోపించారు. మిగిలిన అర్హులైన కార్మికులకు పింఛన్లు అందకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నేతన్నల ఆర్థిక పరిస్థితులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కన్నాపూర్ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్, సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చెట్పల్లి సుధాకర్, మాజీ పట్టణ అధ్యక్షుడు భోగ గంగాధర్, అనుమల్ల జయశ్రీ, జిల్లా నాయకులు ధనంజయి, పొట్టవత్తిని చక్రపాణితోపాటు పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వాల్మీకి కార్పొరేషన్
చైర్మన్‌కు సన్మానం

గట్టు తిమ్మప్పను కలిసిన జర్నలిస్టు మన్నె సురేష్, ఆర్కే ప్రింటర్స్ ఎండీ రామకృష్ణ

హైదరాబాద్, నవంబర్ 23 (ఈవార్తలు): వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పను సీనియర్ జర్నలిస్టు మన్నె సురేష్, ఆర్కే ప్రింటర్స్ ఎండీ రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ఏర్పాటు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గట్టు తిమ్మప్పను శాలువాతో సత్కరించి వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందజేశారు. వాల్మీకి బోయ సామాజికవర్గ అభివృద్ధి, సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు బోయ రాములు, పలువురు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.



ట్రక్ పార్కింగ్ స్థలాన్ని కాపాడాలి: ఈటల

కూకట్‌పల్లి, నవంబర్ 23 (ఈవార్తలు): కూకట్‌పల్లిలోని హుడా ట్రక్ పార్కింగ్ స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరివర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హుడా ట్రక్ పార్కింగ్ స్థలం ప్రజలకు సంబంధించిన ఆస్తి అని, దానిని ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడతారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.



నేతన్నలకు చేయూత పింఛన్లు ఇవ్వాలి

కొడిమ్యాలలో పద్మశాలి సేవా సంఘం వినతి

కొడిమ్యాల, నవంబర్ 23 (ఈవార్తలు): అర్హులైన నేతన్నలకు కొత్త చేయూత పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని కొడిమ్యాల పద్మశాలి సేవా సంఘం డిమాండ్ చేసింది. సోమవారం మండల కేంద్రంలో నేతన్నలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలో ఎంతోమంది నిరుపేద నేతన్నలు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహనాల పత్రాలపై పోలీసుల తనిఖీలు

జగిత్యాల, నవంబర్ 23 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతంలో పోలీసులు సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్, ప్రొబేషనరీ డీఎస్పీలు బి. నరేందర్, ఎల్. తేజస్విని ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. వాహనదారుల ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులతోపాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. వాహనాలకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

జొన్నబండ శివాలయంలో లక్ష పుష్పార్చన

అల్వాల్, నవంబర్ 23 (ఈవార్తలు): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా హైదరాబాద్–అల్వాల్‌లోని జొన్నబండ పాత శివాలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. పండితుడు విరివెంటి రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పాలతో స్వామివారికి ఘనంగా అర్చన చేశారు. ఈ సందర్భంగా భక్తులు తన్మయత్వంలో ఊగిపోయారు. తొలుత గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రోచ్చారణల మధ్య శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. అభిషేకం తర్వాత స్వామివారికి లక్ష పుష్పాలతో అర్చన చేశారు. ఈ క్రతువుల్లో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చీరకట్టుతో పరుగులు

దుబాయ్‌లో భారతీయ మహిళ సందడి

దుబాయ్, నవంబర్ 23 : భారతీయ సంప్రదాయాన్ని చాటుతూనే ఫిట్‌నెస్‌లో తన సత్తా నిరూపిస్తున్నారు దుబాయ్‌లో నివసిస్తున్న మహిళా వ్యాపారవేత్త కాంచన నాయర్. చీరకట్టుతో పరుగులు తీయడం, సైకిల్ తొక్కడం ద్వారా సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు పొందారు. నవంబర్ 22న నిర్వహించిన ‘దుబాయ్ రన్’ కార్యక్రమంలో ఆమె సంప్రదాయ చీర ధరించి పది కిలోమీటర్ల పరుగును విజయవంతంగా పూర్తిచేశారు. ఆమెకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. డిసెంబర్ 2న జరిగే యూఏఈ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ దేశ జాతీయ పతాకం రంగులను ప్రతిబింబించేలా ఎరుపు రంగు చీర, ఆకుపచ్చ జాకెట్టు ధరించారు. తలలో మల్లెపూలు పెట్టుకుని పరుగు తీశారు. యూఏఈ తన రెండో ఇల్లని, తనకు అవకాశాలు కల్పించిన దేశం పట్ల కృతజ్ఞతతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని కాంచన తెలిపారు. తాను పంచుకున్న వీడియోకు ఒక్క రోజులోనే ఐదు లక్షలకు పైగా వీక్షణలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంతకుముందు నవంబర్ 1న కేరళ అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ‘దుబాయ్ రైడ్’లోనూ కాంచన పాల్గొన్నారు. సంప్రదాయ కేరళ చీరకట్టులో షేక్ జాయెద్ రోడ్డుపై సైక్లింగ్ చేశారు. ప్రత్యేకంగా కొనుగోలు చేసిన గులాబీ రంగు సైకిల్, అదే రంగు హెల్మెట్‌తో సందడి చేశారు. దాదాపు 26 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ సైకిల్ తొక్కినట్లు ఆమె వివరించారు. గత 14 ఏళ్లుగా యూఏఈలో నివసిస్తున్న కాంచన, అజ్మాన్‌లో సబా అల్ అరబ్ రియల్ ఎస్టేట్ సంస్థను నిర్వహిస్తున్నారు. వ్యాపారంతో పాటు నటన, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. గతంలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా పనిచేయడం, 2004 రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ అలవడిందని ఆమె చెప్పారు. సంప్రదాయ వస్త్రధారణలోనూ శారీరక దృఢత్వాన్ని ప్రదర్శిస్తున్న ఆమెను నెటిజన్లు అభినందిస్తున్నారు.



మళ్లీ మెరిసిన పసిడి

ముంబై, నవంబర్ 23 : గతవారం భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు సోమవారం మళ్లీ పుంజుకున్నాయి. ధరలు తగ్గిన స్థాయిల వద్ద కొనుగోళ్లు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో బులియన్ మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు కనిపించింది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరగడంతో ఇటీవలి పతనం తాత్కాలికమేనా అనే చర్చ మొదలైంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రాత్రి 10.35 గంటల సమయానికి 10 గ్రాములపై రూ.4,707 పెరిగి రూ.1,26,485 వద్దకు చేరినట్లు మార్కెట్ కథనం పేర్కొంది. ఇది 3.87 శాతం పెరుగుదలకు సమానం. వెండి ఫ్యూచర్స్ ధర కిలోపై రూ.6,705 పెరిగి రూ.1,54,518కు చేరింది. వెండి పెరుగుదల 4.54 శాతంగా నమోదైనట్లు తెలిపింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ సాయంత్రం బెంచ్‌మార్క్ ధరల ప్రకారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,24,945కు చేరింది. వెండి కిలో ధర రూ.1,52,625గా నమోదైంది. ఈ ధరల్లో జీఎస్టీ, నగల తయారీ ఛార్జీలు కలిపి ఉండవు. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధరలు పెరిగాయి. గతవారం తొమ్మిది శాతానికి పైగా తగ్గిన స్పాట్ గోల్డ్ ధర సోమవారం తిరిగి బలపడినట్లు రాయిటర్స్ కథనాన్ని ఉటంకిస్తూ మూల వార్త పేర్కొంది. అమెరికా డాలర్ విలువ, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు తెలిపారు. గతవారం భారీ అమ్మకాల తర్వాత మార్కెట్ తిరిగి స్థిరపడేందుకు ప్రయత్నిస్తోందని యూబీఎస్ విశ్లేషకుడు గియోవన్నీ స్టానోవో అభిప్రాయపడ్డారు. అయితే సమీప భవిష్యత్తులోనూ ధరల్లో ఒడిదుడుకులు కొనసాగవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, డాలర్ విలువ, పెట్టుబడి డిమాండ్ బంగారం ధరల గమనాన్ని నిర్ణయించే కీలక అంశాలుగా ఉండనున్నాయి.

మేలో బుల్లెట్ రైలు ట్రయల్స్!

సూరత్-బిలిమోరా మధ్య 50 కిలోమీటర్ల మార్గం సిద్ధం..

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 23 : దేశంలో తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు మరో కీలక దశకు చేరుకుంది. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా గుజరాత్‌లోని సూరత్–బిలిమోరా మధ్య 50 కిలోమీటర్ల మార్గంలో 2027 మే నెలలో ట్రయల్ రన్స్ ప్రారంభించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ మార్గంలో విద్యుద్దీకరణ పనులు పూర్తికాగా, మిగిలిన సిగ్నలింగ్ పనులను వచ్చే ఏడాది జనవరిలోగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ 20న ఈ సెక్షన్‌లోని అప్, డౌన్ లైన్లకు విద్యుత్ సరఫరా ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకమైన 2ఐ25 కేవీ ట్రాక్షన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బిలిమోరా వద్ద ట్రాక్షన్ సబ్‌స్టేషన్ పనులు కూడా పూర్తయినట్లు చెప్పారు. ప్రయోగాత్మక పరీక్షల కోసం ప్రత్యేకంగా బీ–28 రైలును వినియోగించనున్నారు. గంటకు 280 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించేలా ఈ రైలును రూపొందించారు. హైస్పీడ్ రైళ్లు వేగంగా ప్రయాణించే సమయంలో ఏర్పడే గాలి పీడనాన్ని తట్టుకునేలా బోగీలు, ఇతర పరికరాలను పరీక్షిస్తున్నారు. బీ–28 రైలు ఇప్పటికే కీలకమైన పీడన పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసినట్లు రైల్వే మంత్రి వెల్లడించారు. ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ మొత్తం పొడవు 508 కిలోమీటర్లు. ఈ ప్రాజెక్టును దశలవారీగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుజరాత్‌లోని పలు విభాగాల్లో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండగా, మహారాష్ట్రలో సముద్రగర్భ సొరంగం పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. అయితే మే నెలలో ప్రారంభం కానున్నవి

అధ్యక్ష భవనంలోనూ నీటి కష్టాలు!

షేవింగ్ చేస్తుండగా నీళ్లు ఆగిపోయాయన్న

నైజీరియా అధ్యక్షుడు

అబూజా, నవంబర్ 23 : నీటి కొరత సామాన్యులకే కాదు.. దేశాధ్యక్షుడికీ తప్పలేదు. నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు తన అధికారిక నివాసంలో ఎదుర్కొన్న అనుభవాన్ని బహిరంగంగా వెల్లడించారు. ఇటీవల ఉదయం షేవింగ్ చేసుకుంటుండగా కుళాయిలో నీటి సరఫరా ఒక్కసారిగా నిలిచిపోయిందని చెప్పారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలు ప్రభుత్వ అత్యున్నత భవనంలోనూ ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. లాగోస్‌లో ఆదివారం జరిగిన కుటుంబ ప్రార్థనా సమావేశంలో టినుబు ఈ విషయాన్ని ప్రస్తావించారు. అబూజాలోని అధ్యక్షుడి అధికారిక నివాసం అసో రాక్‌లో తాను షేవింగ్ చేసుకుంటుండగా నీళ్లు నిలిచిపోయాయని వివరించారు. విద్యుత్, నీటి సరఫరాలో సమస్యలు ఉన్నప్పుడు అభివృద్ధిని ఆశించిన స్థాయిలో సాధించడం కష్టమని అన్నారు. ఈ లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అసో రాక్ ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సోలార్ మినీగ్రిడ్ ఏర్పాటుకు గతంలో భారీగా నిధులు కేటాయించారు. అయినప్పటికీ నీరు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు పూర్తిగా తొలగిపోలేదు. నైజీరియాలో గ్యాస్ కొరత, విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు, పాతబడిన పంపిణీ వ్యవస్థ కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. వేగంగా విస్తరిస్తున్న పట్టణాలకు సరిపడా పైపులైన్లు,



నీటి శుద్ధి కేంద్రాలు లేకపోవడంతో తాగునీటి సమస్య కూడా పెరుగుతోంది. అధ్యక్ష భవనంలోనే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అయితే విద్యుత్ పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నామని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

నేపాల్ ప్రధానికి శ్రీకాళహస్తి కళాకృతి!

సంపూర్ణ రామాయణం కలంకారీ

పెయింటింగ్ బహూకఖశ్రీ

న్యూఢిల్లీ, నవంబర్ 23 : భారత పర్యటనకు వచ్చిన నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షాకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుదైన కానుకలను అందజేశారు. ఇరు దేశాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలకు గుర్తుగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి కలంకారీ శైలిలో రూపొందించిన సంపూర్ణ రామాయణం పెయింటింగ్‌ను బహూకరించారు. దీనితో పాటు కాశీ పవిత్ర గంగాజలం, బనారసి బ్రోకేడ్ శాలువాను కూడా అందించారు. శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు రూపొందించిన సంపూర్ణ రామాయణం పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పత్తి వస్త్రంపై వెదురు కలం, సహజ రంగులను ఉపయోగించి రామాయణంలోని ప్రధాన ఘట్టాలను చిత్రించారు. శ్రీరాముడి జననం, వనవాసం, రావణ సంహారం, అయోధ్యకు తిరిగి రావడం వంటి సంఘటనలను సంప్రదాయ చిత్రకళ ద్వారా చూపించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ కళాకృతి భారత్–నేపాల్ ఉమ్మడి ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తోంది. అయోధ్యలో శ్రీరాముడి జన్మస్థలం,



నేపాల్‌లోని జనక్‌పూర్‌లో సీతాదేవి జన్మస్థలం మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధానికి సంకేతంగా దీనిని ఎంపిక చేసినట్లు వివరించారు. కాశీలోని పవిత్ర గంగాజలాన్ని కళాత్మకమైన ఇత్తడి కలశంలో ఉంచి నేపాల్ ప్రధానమంత్రికి అందించారు. వారణాసి చేనేత కళాకారులు రూపొందించిన బనారసి బ్రోకేడ్ సిల్క్ శాలువాను కూడా బహూకరించారు. ఈ శాలువాను గుజరాత్ సంప్రదాయ సదేలీ కళాకృతితో అలంకరించిన చెక్క పెట్టెలో ఉంచారు. ప్రభుత్వాధినేతల మధ్య అధికారిక పర్యటనల్లో బహూకరించే కానుకలు ఆయా దేశాల సాంస్కృతిక గుర్తింపును చాటుతుంటాయి. ఈసారి భారత ప్రభుత్వం అందించిన బహుమతుల్లో తెలుగు రాష్ట్రానికి చెందిన శ్రీకాళహస్తి కలంకారీ కళకు స్థానం దక్కడం విశేషం.

పాకిస్థాన్ తొలి వ్యోమగామి నింగిలోకి

చైనా షెన్‌జౌ-24 మిషన్‌లో అవకాశం

ప్రయోగానికి ముందు రిహార్సల్స్ పూర్తి

ఇస్లామాబాద్, నవంబర్ 23 : చైనా సహకారంతో పాకిస్థాన్ తన తొలి ప్రభుత్వ మానవసహిత అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. చైనా చేపడుతున్న షెన్‌జౌ-24 మిషన్‌లో పాక్ వ్యోమగామికి అవకాశం కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రయోగ సన్నాహాలు గోబీ ఎడారిలోని జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రంలో కొనసాగుతున్నాయి. పూర్తి స్థాయి లాంచ్ రిహార్సల్స్ విజయవంతంగా పూర్తయినట్లు పాకిస్థాన్ అంతరిక్ష సంస్థ వెల్లడించింది. ఈ మిషన్‌లో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన వ్యోమగామి చైనా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించనున్నారు. అక్కడ దాదాపు వారం రోజులపాటు శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించే అవకాశముంది. అనంతరం షెన్‌జౌ-23 నౌక ద్వారా భూమికి తిరిగి వచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. పాక్ సైన్యానికి చెందిన పైలట్లు మహమ్మద్ జీషన్ అలీ, ఖుర్రమ్ దావూద్ చైనాలో శిక్షణ పొందారు. వీరిలో ఒకరిని అంతరిక్ష యాత్రకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వ్యక్తి తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించే తొలి విదేశీ వ్యోమగామిగా గుర్తింపు పొందనున్నారు. మిషన్‌కు సంబంధించిన సెండ్‌ఆఫ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పాకిస్థాన్ ప్రణాళికా శాఖ మంత్రి అహ్సన్ ఇక్బాల్ చైనా చేరుకున్నారు. పాక్ అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. షెన్‌జౌ-24 ప్రయోగానికి లాంగ్ మార్చ్-2ఎఫ్ రాకెట్‌ను ఉపయోగించనున్నారు. అయితే ప్రయోగ తేదీని చైనా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గతంలో పాకిస్థాన్‌కు చెందిన నమీరా సలీమ్ సబ్‌ఆర్బిటల్ స్పేస్ టూరిజంలో పాల్గొన్నారు. కానీ ప్రభుత్వ భాగస్వామ్యంతో కక్ష్యలోని అంతరిక్ష కేంద్రానికి వ్యోమగామిని పంపడం పాకిస్థాన్‌కు ఇదే తొలిసారి కానుంది.

గూగుల్, మైక్రోసాఫ్ట్ నియామకాలకు బ్రేక్?

2027 క్యాంపస్ హైరింగ్‌పై

సోషల్ మీడియాలో ప్రచారం

అధికారిక ప్రకటన చేయని కంపెనీలు

న్యూఢిల్లీ, నవంబర్ 23 : వచ్చే ఏడాది ఐటీ రంగంలో క్యాంపస్ నియామకాలు తగ్గుతాయనే ప్రచారం ఉద్యోగార్థుల్లో ఆందోళన పెంచుతోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, డేటాబ్రిక్స్ వంటి అంతర్జాతీయ టెక్ కంపెనీలు 2027లో భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో నియామకాలను నిలిపివేయవచ్చనే ఊహాగానాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ ప్రచారాన్ని సంబంధిత కంపెనీలు అధికారికంగా ధ్రువీకరించలేదు. టెక్ నిపుణుడు ప్రత్యూష్ రాయ్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టు ఈ చర్చకు కారణమైంది. వచ్చే ఏడాది కొన్ని ప్రముఖ టెక్ సంస్థలు కొత్త నియామకాలు చేపట్టకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఈ అంచనా ప్రపంచవ్యాప్త నియామకాలన్నింటికీ వర్తించదని, ప్రధానంగా భారతీయ ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థల క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినదిగా చూడాలని స్పష్టం చేశారు. మరోవైపు ఉద్యోగుల అనుభవాలను పంచుకునే బ్లైండ్ వేదికలోనూ నియామకాల నిలిపివేత, ఉద్యోగాల కోతలపై పోస్టులు కనిపిస్తున్నాయి. గూగుల్‌లోని కొన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్ తగ్గిందని, పనితీరు మెరుగుదల పథకాల పేరుతో కొందరు ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని కొందరు యూజర్లు ఆరోపించారు. టెక్ కంపెనీలు ప్రస్తుతం ఏఐ రంగంపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో సంప్రదాయ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఎంట్రీ లెవల్ ఇంజినీరింగ్ ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చ పెరుగుతోంది. అయితే ఏఐ పెట్టుబడులు పెరుగుతున్నాయనే కారణంతోనే అన్ని టెక్ ఉద్యోగాలు తగ్గుతాయని నిర్ణయించలేం. భారత్‌లో 2027 క్యాంపస్ నియామకాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు గూగుల్, మైక్రోసాఫ్ట్, డేటాబ్రిక్స్ అధికారిక ప్రకటన చేయలేదు. కాబట్టి ఈ సమాచారాన్ని ధ్రువీకరించని ప్రచారంగానే చూడాలి.

నేపాల్‌కు భారత్ రూ.15 వేల కోట్ల ప్యాకేజీ

న్యూఢిల్లీ, నవంబర్ 23 : నేపాల్ అభివృద్ధికి భారత్ భారీ ఆర్థిక సహకారాన్ని ప్రకటించింది. నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా భారత పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం రూ.15 వేల కోట్ల అభివృద్ధి సహాయ ప్యాకేజీని ప్రకటించారు. ఇది నేపాలీ కరెన్సీలో 24 వేల కోట్ల రూపాయలకు సమానం. వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల పునర్నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, ఇంధన రంగ ప్రాజెక్టులకు ఈ నిధులను



వినియోగించనున్నారు. నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బాలేంద్ర షా భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి. సోమవారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మోదీతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, రవాణా, ఇంధనం, సరిహద్దు కనెక్టివిటీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. భారత్ ప్రకటించిన మొత్తం రూ.15 వేల కోట్ల ప్యాకేజీలో రూ.3,500 కోట్లు గ్రాంట్ సహాయం, రూ.11,500 కోట్లు రూపాయల్లో అందించే రుణ సదుపాయం ఉన్నాయి. వరదల అనంతర పునర్నిర్మాణం, కొత్త మౌలిక వసతులకు గ్రాంట్ ఉపయోగపడనుండగా, ఇంధన రంగ ప్రాజెక్టులకు రుణ సదుపాయం కల్పించనున్నారు.



శివాజీ విగ్రహానికి భూమిపూజ

కొడిమ్యాల, నవంబర్ 23 (ఈవార్తలు): కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు పుణ్యాహవచనం నిర్వహించి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊట్కూరి శ్రీలత, ఉప సర్పంచ్ సాయికుమార్, మర్రి మహేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, యువకులు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి రోడ్డుకు మోక్షమెప్పుడు?

15 ఏళ్లుగా నిర్మాణానికి అడ్డంకులా?

పుష్కరాల నాటికైనా రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి: బొల్లం కిషన్

కాళేశ్వరం, నవంబర్ 23 (ఈవార్తలు): కాళేశ్వరంలోని గోదావరి రోడ్డు నిర్మాణానికి 15 ఏళ్లుగా అడ్డంకులు ఎదురవుతున్నాయని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్ ఆరోపించారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికైనా రోడ్డు నిర్మాణంతోపాటు డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం బస్టాండ్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ఉన్న ప్రధాన రహదారి నిర్మాణాన్ని కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇన్నేళ్లుగా సమస్యకు పరిష్కారం చూపడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. గ్రామానికి ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో కనీసం డ్రైనేజీ సౌకర్యం కూడా లేకపోవడం దారుణమన్నారు. నిత్యం వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, భక్తులు, ప్రయాణికులు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రతి పుష్కరాల సమయంలో అభివృద్ధి పనులపై హామీలు ఇస్తున్నా గోదావరి రోడ్డు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని కిషన్ విమర్శించారు. ఒక్కరిద్దరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం వేలాది మంది ప్రజలకు ఉపయోగపడే రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. రాబోయే పుష్కరాల సందర్భంగా కాళేశ్వరానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అప్పటికి రహదారి అభివృద్ధి చేయకపోతే భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజా అవసరాలను పక్కన పెట్టొద్దని కోరారు. స్థానిక మంత్రి చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని డిమాండ్ చేశారు. రోడ్డుతోపాటు డ్రైనేజీ పనులు వెంటనే ప్రారంభించాలని, లేనిపక్షంలో ఈ సమస్యపై ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

సర్వే నంబర్ 463లో మిగులు భూమిని పేదలకు పంచాలి: మెరుగు లక్ష్మణ్

మహాదేవపూర్, నవంబర్ 23 (ఈవార్తలు): మహాదేవపూర్ మండల కేంద్రంలోని బట్టీకొట్టు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 463 ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మిగులు భూమిని గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 463లో మొత్తం 7 ఎకరాల 37 గుంటల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. అందులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు వేదిక, రైతు గిడ్డంగులు వంటి ప్రభుత్వ నిర్మాణాలు పోగా ఇంకా సుమారు రెండు ఎకరాల భూమి మిగిలి ఉందని పేర్కొన్నారు. మిగులు భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు వెంటనే కంచె ఏర్పాటు చేయాలని కోరారు. రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి భూమి హద్దులను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. భూమి ఎవరి ఆక్రమణలో ఉందో గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. భూమి లేని నిరుపేదలు, దినసరి కూలీలు, బడుగు బలహీన వర్గాల కుటుంబాలను పారదర్శకంగా గుర్తించి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు న్యాయం జరిగేలా స్థానిక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని, మంథని ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎనిమిది కీలక ఒప్పందాలు

రెండు దేశాల మధ్య ఎనిమిది అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అంతరిక్ష పరిశోధన, ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణ, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, ఆయుర్వేదం, సంప్రదాయ వైద్యం వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు నిర్ణయించారు. అలాగే రహదారులు, రైల్వేలు, ఇంధన సరఫరా, సరిహద్దు మౌలిక వసతులకు సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించారు. కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా ప్రారంభించగా, మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. భారత్, నేపాల్ మధ్య సంబంధాలు కేవలం పొరుగు దేశాల స్థాయిలో కాకుండా ప్రజల మధ్య శతాబ్దాల అనుబంధంతో కొనసాగుతున్నాయని మోదీ పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నేపాల్‌కు భారత్ అండగా నిలిచిందని గుర్తుచేశారు. భారత ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి బాలేంద్ర షా కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారం, విద్య, ఇంధన రంగాల్లో భారత పెట్టుబడులను ఆహ్వానించారు. నేపాల్‌లో అభివృద్ధి అవకాశాలను వినియోగించుకోవాలని భారత కంపెనీలను కోరారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక సహకారాన్ని మరింత విస్తరించే దిశగా కీలక అడుగుగా నిలిచింది.

మేలో బుల్లెట్ రైలు ట్రయల్స్!

సూరత్-బిలిమోరా మధ్య 50 కిలోమీటర్ల మార్గం సిద్ధం..

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 23 : దేశంలో తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు మరో కీలక దశకు చేరుకుంది. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా గుజరాత్‌లోని సూరత్–బిలిమోరా మధ్య 50 కిలోమీటర్ల మార్గంలో 2027 మే నెలలో ట్రయల్ రన్స్ ప్రారంభించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ మార్గంలో విద్యుద్దీకరణ పనులు పూర్తికాగా, మిగిలిన సిగ్నలింగ్ పనులను వచ్చే ఏడాది జనవరిలోగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ 20న ఈ సెక్షన్‌లోని అప్, డౌన్ లైన్లకు విద్యుత్ సరఫరా ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకమైన 2ఐ25 కేవీ ట్రాక్షన్ వ్యవస్థను ఏర్పాటు





నయనతారకు విఘ్నేశ్ కానుకగా రోల్స్ రాయిస్

ఈవార్తలు, వినోదవాణి: నయనతార 42వ పుట్టినరోజుకు ఆమె భర్త విఘ్నేశ్ రూ.10 కోట్ల విలువైన రోల్స్ రాయిస్ కారును కానుకగా ఇచ్చారు. 'బ్లాక్ బ్యాడ్జ్ స్పెక్టర్' మోడల్‌కు చెందిన ఈ లగ్జరీ ఎలక్ట్రిక్ కారు నయన్ ఇంటికి చేరింది. పుట్టినరోజు సందర్భంగా నయనతార తన కుటుంబ ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

సారా పెళ్లి వార్తల్లో నిజం లేదు

ఈవార్తలు, వినోదవాణి: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ వివాహంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె పీఆర్ బృందం తెరదించింది. బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ కుమారుడు రాజ్‌వీర్ డియోల్‌ను సారా పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. వీరిద్దరూ ఇప్పటివరకు కనీసం



ఒకరినొకరు కలుసుకోలేదని వెల్లడించింది. కొద్దిరోజులుగా సారా, రాజ్‌వీర్ ఫొటోలను జతచేస్తూ వీరిద్దరి వివాహం త్వరలో జరగనుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వార్తలపై సారా పీఆర్ బృందం స్పందించింది. సారా ప్రస్తుతం సింగిల్‌గా ఉన్నారని, తన కెరీర్‌పైనే దృష్టి పెట్టారని తెలిపింది. ఇలాంటి నిరాధార ప్రచారం అనవసరమని, వ్యక్తిగతంగా ఇబ్బంది కలిగిస్తుందని పేర్కొంది. సారా ప్రస్తుతం మోడలింగ్‌తో పాటు వ్యాపార రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో నటుడికి ఏడాది జైలు!

మలయాళ నటుడు శ్రీజిత్ రవికి రూ.50 వేల జరిమానా.. అప్పీల్ కోసం తాత్కాలిక బెయిల్

ఈవార్తలు, వినోదవాణి: పాఠశాల విద్యార్థుల ఎదుట అసభ్యంగా ప్రవర్తించిన కేసులో మలయాళ నటుడు శ్రీజిత్ రవికి కేరళలోని త్రిస్సూర్ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో రూ.50 వేల జరిమానా కూడా విధించింది. అయితే తీర్పును పైకోర్టులో సవాల్ చేసుకునేందుకు వీలుగా నెలరోజుల గడువుతో కూడిన బెయిల్ మంజూరు చేసినట్లు సమాచారం. 2022 జూలై 4న త్రిస్సూర్‌లోని అయ్యంతోల్ గ్రౌండ్ సమీపంలో ఇద్దరు పాఠశాల విద్యార్థుల ఎదుట శ్రీజిత్ రవి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో న్యాయస్థానం మొత్తం 21 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు కథనం పేర్కొంది. దాదాపు నాలుగేళ్లపాటు సాగిన విచారణ అనంతరం ప్రత్యేక కోర్టు తీర్పు వెల్లడించింది. అయితే శ్రీజిత్ రవి అప్పీల్ చేసుకునే అవకాశం ఉండటంతో న్యాయపరమైన ప్రక్రియ కొనసాగనుంది. సీనియర్ మలయాళ నటుడు టి.జి. రవి కుమారుడైన శ్రీజిత్ రవి 2005లో సినీ రంగంలోకి ప్రవేశించారు.

యశ్‌కు మళ్లీ క్రేజ్!

ఈవార్తలు, వినోదవాణి: కన్నడ స్టార్ హీరో యశ్‌కు 'రామాయణం పార్ట్ 1' మరోసారి మంచి గుర్తింపు తెచ్చిపెట్టినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'కేజీఎఫ్ 2' తర్వాత భారీ అంచనాలతో విడుదలైన 'టాక్సిక్' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన నేపథ్యంలో, 'రామాయణం'లో రావణుడిగా యశ్ నటనకు మంచి స్పందన వస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందిన 'టాక్సిక్' ఆగస్టులో విడుదలైంది. రూ.500 కోట్లకు పైగా బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.340 కోట్ల వసూళ్లకే పరిమితమైనట్లు ట్రేడ్ నివేదికలు పేర్కొన్నాయి. దీంతో యశ్ తదుపరి సినిమా ఫలితంపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణం పార్ట్ 1'లో యశ్ రావణుడి పాత్ర పోషించారు. లంకాధిపతిగా ఆయన గెటప్, స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నట్లు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా స్టార్ హీరోలు ప్రతినాయక పాత్రలను ఎంచుకోవడానికి ఆలోచిస్తుంటారు. అయితే యశ్ రావణుడి పాత్రను అంగీకరించడం విశేషంగా నిలిచింది. ఆ పాత్రలోని శక్తి, అహంకారం, గాంభీర్యాన్ని తెరపై చూపించేందుకు ఆయన చేసిన ప్రయత్నానికి ప్రశంసలు వస్తున్నాయి. 'రామాయణం



పార్ట్ 1' భారీ వసూళ్లు సాధిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దేశీయ నెట్ వసూళ్లు రూ.వెయ్యి కోట్లకు చేరువవుతున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ప్రేక్షకుల స్పందనపై యశ్ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. రావణుడి వేషధారణలో తన పిల్లలతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'రామాయణం పార్ట్ 2'లో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



రాంచరణ్ సరసన సాత్విక?

ఈవార్తలు, వినోదవాణి: రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'ఆర్‌సీ 17' సినిమాలో హీరోయిన్ ఎవరనే అంశంపై ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో గుర్తింపు పొందిన సాత్విక వీరవల్లిని ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. 'రంగస్థలం' తర్వాత రామ్ చరణ్, సుకుమార్ కలిసి చేస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తికాగా, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు సమాచారం. మరో మూడు నాలుగు వారాల్లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం పలువురిని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముగ్గురు నలుగురు నటీమణులకు ఆడిషన్లు, లుక్ టెస్టులు నిర్వహించారని, వారిలో ఇద్దరిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సాత్విక వీరవల్లి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కథలో హీరోయిన్ పాత్రకు భావోద్వేగపరంగా ప్రాధాన్యం ఉండటంతో తెలుగు మాట్లాడగలిగే నటిని ఎంపిక చేయాలని దర్శకుడు భావిస్తున్నట్లు సమాచారం. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో సాత్విక నటనకు మంచి స్పందన వచ్చినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఆమెను రామ్ చరణ్ సరసన ఎంపిక చేసే అవకాశాలు పెరిగాయని ప్రచారం జరుగుతోంది. గతంలో ఈ పాత్రకు సారా అర్జున్ పేరు కూడా వినిపించింది. అయితే హీరోయిన్ ఎంపికపై చిత్ర బృందం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందనుంది. ప్రస్తుతం రామ్ చరణ్ తన పాత్రకు అనుగుణంగా మేకోవర్‌పై దృష్టి పెట్టినట్లు సమాచారం. హెయిర్ స్టైల్, బాడీ లాంగ్వేజ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



నచ్చింది కాబట్టే స్పెషల్ సాంగ్ చేశా

ఈవార్తలు, వినోదవాణి: రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమాలో స్పెషల్ సాంగ్ చేయడానికి గల కారణాన్ని నటి శ్రుతిహాసన్ వెల్లడించారు. తనకు డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టమని, పాట ట్యూన్ నచ్చడంతోనే అంగీకరించానని చెప్పారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'హెల్లల్లల్లో' పాట గురించి ఆమె ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న సమయంలో స్పెషల్ సాంగ్ చేయడంపై ఎదురైన ప్రశ్నకు శ్రుతిహాసన్ స్పందించారు. పాట నచ్చితే చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. 'హెల్లల్లల్లో' పాట ట్యూన్ వినగానే ఆకట్టుకుందని చెప్పారు. "నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. పాట ట్యూన్ బాగా నచ్చింది. అందులో ధరించిన దుస్తులు కూడా నాకు కంఫర్టబుల్‌గా అనిపించాయి. అందుకే ఆ పాటను ఎంజాయ్ చేస్తూ చేశాను" అని శ్రుతిహాసన్ వివరించారు. పాట చిత్రీకరణ సమయంలో తనకు ఎవరూ ప్రత్యేకంగా హద్దులు విధించలేదని తెలిపారు. తనకు నచ్చిన విధంగా డ్యాన్స్ చేసే స్వేచ్ఛ లభించిందన్నారు. స్పెషల్ సాంగ్ అయినా, యాక్షన్ సన్నివేశమైనా తన బృందంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని చెప్పారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటించారు. శ్రుతిహాసన్ ఇటీవల 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటించారు. ప్రస్తుతం తమిళంలో 'ట్రైన్', 'వెట్టువం' సినిమాలతో పాటు హిందీలో 'కాల్ మీ బే సీజన్ 2' వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నట్లు సమాచారం.

సుబ్బులక్ష్మిగా మారేందుకు
రష్మిక కసరత్తు

ఈవార్తలు, వినోదవాణి: ప్రముఖ గాయని, భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న సినిమాలో నటించేందుకు రష్మిక మందన్న ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. సుబ్బులక్ష్మి పాత్రను సహజంగా పోషించేందుకు కర్ణాటక సంగీతం నేర్చుకుంటున్నట్లు సమాచారం. ఆమె హావభావాలు, బాడీ లాంగ్వేజ్‌ను అర్థం చేసుకునేందుకు పాత వీడియోలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 'ఎం.ఎస్: ఎ లెగసీ ఆన్ స్క్రీన్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమా పూజా కార్యక్రమాలు పూర్తికాగా, రెగ్యులర్ షూటింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. సుబ్బులక్ష్మి జీవితాన్ని తెరపై చూపించాలంటే నటనతో పాటు సంగీతంపై అవగాహన అవసరమని రష్మిక భావిస్తున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అందుకే కర్ణాటక సంగీతంలో ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ.. తనకు పాటలు పాడటం అలవాటు లేదని, ఇంట్లో కూడా సరదాగా హమ్ చేయనని చెప్పినట్లు కథనాలు పేర్కొన్నాయి.





పెళ్లి చేసుకున్న మైలీ సైరస్!

ఈవార్తలు, వినోదవాణి: అంతర్జాతీయ పాప్ సింగర్ మైలీ సైరస్ తన చిరకాల ప్రియుడు, సంగీతకారుడు మాక్స్ మొరాండోను వివాహం చేసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం పామ్ స్ప్రింగ్స్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరిగినట్లు కథనాలు పేర్కొన్నాయి. పెళ్లికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టినట్లు సమాచారం.



తిలక్ సెంచరీ వృథా!

పాకిస్థాన్ 'ఎ' చేతిలో భారత్ 'ఎ' ఓటమి

48 పరుగుల తేడాతో గెలిచిన పాక్..

314 పరుగుల లక్ష్యఛేదనలో చేతులెత్తేసిన భారత బ్యాటర్లు

ఈవార్తలు, క్రీడావాణి: కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత సెంచరీతో పోరాడినా భారత్ 'ఎ' జట్టుకు ఓటమి తప్పలేదు. ఏసీసీ మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 'ఎ' జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 313 పరుగులు చేయగా, లక్ష్యఛేదనలో భారత్ 49.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. 314 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ మెరుపు ఆరంభం ఇచ్చాడు. 42 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 70 పరుగులు చేశాడు. అయితే అతడు ఔటైన తర్వాత భారత బ్యాటింగ్ ఒక్కసారిగా కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (11), ఆయుష్ బదోని (0), కుమార్ కుశాగ్ర (2), రింకూ సింగ్ (6), సూర్యాన్ష్ షెడ్గే (6) విఫలమయ్యారు. దీంతో భారత్ 129 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ తిలక్ వర్మ, షహబాజ్ అహ్మద్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ కలిసి ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించి విజయంపై ఆశలు రేపారు. షహబాజ్ 56 పరుగులతో రాణించాడు. అయితే 43వ ఓవర్‌లో అతడు ఔటవడంతో మ్యాచ్ మళ్లీ పాకిస్థాన్ వైపు మొగ్గింది. ఆ తర్వాత విప్రాజ్ నిగమ్, హర్షిత్ రాణా పరుగులేమీ చేయకుండా వెనుదిరిగారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా తిలక్ వర్మ పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. 147 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు. పాకిస్థాన్ బౌలర్లలో అలీ రజా, హసన్ నవాజ్ చెరో మూడు వికెట్లు పడగొట్టగా, మహ్మద్ ఇమ్రాన్ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు పాకిస్థాన్ 'ఎ' జట్టు 49.2 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. హసన్ నవాజ్ 79 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మాజ్ సదాకత్ (59), ఫర్హాన్ యూసఫ్ (56) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో విప్రాజ్ నిగమ్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, సూర్యాన్ష్ షెడ్గే తలో రెండు వికెట్లు పడగొట్టారు. నేపాల్‌పై తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్‌కు టోర్నీలో ఇదే తొలి ఓటమి.

కుల్దీప్ ఎక్కడ?: గంగూలీ

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగియడంతో భారత జట్టు ఎంపికపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. విదేశీ గడ్డపై ఫ్లాట్ పిచ్‌లపై టెస్టులు గెలవాలంటే స్పెషలిస్ట్ స్పిన్నర్ అవసరమని పేర్కొన్నాడు. కుల్దీప్ యాదవ్ లేదా మానవ్ సుతార్‌ను ఎందుకు ఆడించలేదని ప్రశ్నించాడు. వెల్లింగ్టన్ టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 720/9 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయితే న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు మాత్రమే పడగొట్టగలిగింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ నేపథ్యంలో గంగూలీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించాడు. భారత బ్యాటర్ల ప్రదర్శనను ప్రశంసిస్తూనే బౌలింగ్ విభాగంపై ప్రశ్నలు లేవనెత్తాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌తోపాటు రెడ్ బాల్ క్రికెట్‌లోనూ భారత్ నిలకడగా రాణించిందని పేర్కొన్నాడు. అయితే సమయం గడిచేకొద్దీ ఫ్లాట్‌గా మారే పిచ్‌లపై వికెట్లు తీయాలంటే స్పెషలిస్ట్ స్పిన్నర్ తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డాడు. వాషింగ్టన్ సుందర్ మంచి ఆల్‌రౌండర్ అయినప్పటికీ, టెస్టుల్లో స్పెషలిస్ట్ స్పిన్నర్ అవసరాన్ని విస్మరించకూడదని గంగూలీ సూచించాడు. కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్‌లను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని బీసీసీఐని ప్రశ్నించాడు. వెల్లింగ్టన్ టెస్టుకు ముందే కుల్దీప్ యాదవ్‌ను జట్టు నుంచి విడుదల చేసి పేసర్ గుర్నూర్ బ్రార్‌ను చేర్చారు. దేశవాళీ క్రికెట్ ఆడేందుకు వెళ్లిన కుల్దీప్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఉత్తరప్రదేశ్ తరఫున ఆడాడు. మానవ్ సుతార్ రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. రవీంద్ర జడేజా అందుబాటులో ఉన్నప్పటికీ భారత్ వాషింగ్టన్ సుందర్‌ను మాత్రమే స్పిన్నర్‌గా తుది జట్టులోకి తీసుకుంది. ఈ నిర్ణయాన్ని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సమర్థించాడు. న్యూజిలాండ్ జట్టులో నలుగురు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఉండటంతో ఆఫ్ స్పిన్నర్ సుందర్‌ను ఎంపిక చేశామని వివరించాడు. అతడి బ్యాటింగ్ సామర్థ్యం కూడా జట్టుకు అదనపు ప్రయోజనమని పేర్కొన్నాడు. అయితే బౌలింగ్‌కు సహకరించని పిచ్‌పై భారత జట్టు ప్రత్యర్థిని ఆలౌట్ చేయలేకపోవడంతో స్పిన్నర్ల ఎంపికపై చర్చ కొనసాగుతోంది.



విసిగించి.. డ్రా చేశారు!

భారత్ గెలుపునకు కివీస్ బ్రేక్.. డ్రాగా ముగిసిన వెల్లింగ్టన్ తొలి టెస్టు

మిచెల్, ఫిలిప్స్ పోరాటం.. భారత్‌కు దక్కని విజయం

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టులో భారత జట్టుకు విజయం చేజారింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసి మ్యాచ్‌పై పట్టు సాధించినప్పటికీ చివరి రోజు కివీస్ బ్యాటర్లను ఆలౌట్ చేయలేకపోయింది. డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ పట్టుదలతో బ్యాటింగ్ చేసి న్యూజిలాండ్‌ను ఓటమి నుంచి కాపాడారు. దీంతో బేసిన్ రిజర్వ్ వేదికగా జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 720/9 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌట్ కావడంతో టీమిండియాకు 352 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 119/2 స్కోరుతో నిలిచింది. చివరి రోజు భారత బౌలర్లు ఆరంభంలో రెండు కీలక వికెట్లు పడగొట్టారు. అయితే ఆ తర్వాత న్యూజిలాండ్ బ్యాటర్లు పట్టుదలతో ఆడారు. ముఖ్యంగా డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లకు అవకాశం ఇవ్వకుండా క్రీజులో నిలిచారు. మిచెల్ 49 పరుగులతో, ఫిలిప్స్ 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 258 బంతుల్లో 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 120 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. భారత బౌలర్లు చివరి రోజు 75 ఓవర్లు వేసినా మూడు వికెట్లు మాత్రమే పడగొట్టగలిగారు. జస్‌ప్రీత్ బుమ్రా కేవలం రెండు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సమయంలో కేఎల్ రాహుల్ తాత్కాలికంగా జట్టును నడిపించాడు. వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ కోసం తీసుకున్న రివ్యూ ఫలించలేదు. చివర్లో యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్‌తో కూడా బౌలింగ్ చేయించినా వికెట్లు దక్కలేదు. చివరకు మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరుజట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. ఈ ఫలితంతో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ పీసీటీ 50 శాతానికి పడిపోయింది.





డ్రాతో మారిన డబ్ల్యూటీసీ లెక్కలు

నాలుగో స్థానంలోనే భారత్

మూడో స్థానానికి పడిపోయిన కివీస్

రెండో స్థానానికి చేరిన ఆస్ట్రేలియా

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగియడంతో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 పాయింట్ల పట్టికలో మార్పులు చోటుచేసుకున్నాయి. గెలిచే అవకాశం ఉన్న మ్యాచ్‌ను డ్రాగా ముగించడంతో భారత్ పాయింట్ల శాతం తగ్గింది. మరోవైపు న్యూజిలాండ్ రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయింది. వెల్లింగ్టన్ టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 720/9 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు మాత్రమే చేయడంతో టీమిండియాకు 352 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్‌ను ఆలౌట్ చేసి ఇన్నింగ్స్ విజయం సాధించే అవకాశం భారత్‌కు లభించింది. అయితే చివరి రోజు డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ పట్టుదలతో ఆడటంతో భారత బౌలర్ల ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ ఫలితంతో న్యూజిలాండ్ పాయింట్ల శాతం 72.22 నుంచి 66.67కు తగ్గింది. దీంతో ఆ జట్టు రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా 69.23 పీసీటీతో రెండో స్థానానికి చేరుకుంది. దక్షిణాఫ్రికా 75 శాతం పీసీటీతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత్ పాయింట్ల శాతం 51.52 నుంచి 50కు తగ్గినప్పటికీ నాలుగో స్థానంలోనే నిలిచింది. తర్వాతి స్థానాల్లో బంగ్లాదేశ్, ఇంగ్లండ్, వెస్టిండీస్, శ్రీలంక, పాకిస్థాన్ జట్లు ఉన్నాయి. ఫైనల్ రేసులో నిలవాలంటే రాబోయే మ్యాచ్‌ల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భారత్‌కు ఆరు టెస్టులే!

డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో క్లిష్టమైన సమీకరణాలు



ఈవార్తలు, క్రీడావాణి: వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 ఫైనల్ చేరాలన్న భారత జట్టు ఆశలకు వెల్లింగ్టన్ టెస్టు డ్రా ఫలితం ఎదురుదెబ్బగా మారింది. న్యూజిలాండ్‌పై భారీ ఆధిక్యం సాధించినప్పటికీ మ్యాచ్‌ను గెలవలేకపోవడంతో పాయింట్ల పట్టికలో భారత్ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. వెల్లింగ్టన్ టెస్టు డ్రా కావడంతో భారత్ పాయింట్ల శాతం 51.52 నుంచి 50కు తగ్గింది. ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా ఇప్పటివరకు 12 టెస్టులు ఆడింది. ఐదు విజయాలు, నాలుగు ఓటములు, మూడు డ్రాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు న్యూజిలాండ్ పీసీటీ 66.67కు తగ్గడంతో రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా రెండో స్థానానికి చేరుకోగా, దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత సైకిల్‌లో భారత్‌కు ఇంకా ఆరు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగే రెండో టెస్టుతోపాటు వచ్చే ఏడాది స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ ఆడనుంది. ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ ఆరు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. అన్ని మ్యాచ్‌లు గెలిస్తే భారత పీసీటీ గరిష్ఠంగా 66.67 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. అయితే ఆరు మ్యాచ్‌ల్లో గెలిచినా ఫైనల్ బెర్త్ ఖాయమని చెప్పలేం. ఇతర జట్ల గెలుపోటములు కూడా కీలకంగా మారనున్నాయి. ఒక్క మ్యాచ్ ఓడినా లేదా డ్రా అయినా భారత్ అవకాశాలు మరింత తగ్గే ప్రమాదం ఉంది. దీంతో రాబోయే ప్రతి టెస్టు టీమిండియాకు కీలకంగా మారింది. ముఖ్యంగా న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో విజయం సాధించడం భారత్‌కు అత్యంత అవసరంగా కనిపిస్తోంది.



ప్రపంచకప్ రేసులో రోహిత్, కోహ్లీ

ఈవార్తలు, క్రీడావాణి: భారత క్రికెట్ దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడే అవకాశాలపై ఆసక్తికర సమాచారం వెలువడింది. ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లు ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగానే ఉన్నట్లు బీసీసీఐ వర్గాల ద్వారా తెలుస్తోంది. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండటంతోపాటు ఆడేందుకు ఆసక్తి చూపిస్తే వారిని జట్టులో కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరగనుంది. ముఖ్యంగా దక్షిణాఫ్రికా పిచ్‌లపై రోహిత్, కోహ్లీ అనుభవం భారత జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని బీసీసీఐకి చెందిన ఓ సీనియర్ అధికారి అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దక్షిణాఫ్రికాలో ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్, కోహ్లీ వంటి అనుభవజ్ఞుల అవసరం ఉంటుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఇద్దరూ భారత క్రికెట్‌కు ఎన్నో విజయాలు అందించిన ఆటగాళ్లని, ఎంతకాలం ఆడాలనేది వారి వ్యక్తిగత నిర్ణయమని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఇద్దరూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. నాలుగు ఇన్నింగ్స్‌లలో రోహిత్ 30 పరుగులు చేయగా, కోహ్లీ 86 పరుగులు మాత్రమే సాధించాడు. అయినప్పటికీ వారి అనుభవంపై బీసీసీఐ నమ్మకం ఉంచినట్లు వార్తలు వస్తున్నాయి. రోహిత్, కోహ్లీ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. ప్రపంచకప్‌కు ముందు భారత్ పరిమిత సంఖ్యలోనే వన్డే మ్యాచ్‌లు ఆడనుంది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
మంగళవారం 24-11-2026, జగిత్యాల
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

ఊపిరి కోసం న్యాయపోరాటం!

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ఏటా తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. చలికాలం వచ్చిందంటే గాలి నాణ్యత క్షీణించడం, ప్రజలు శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కోవడం, కాలుష్య నియంత్రణకు అత్యవసర చర్యలు ప్రకటించడం సాధారణ పరిణామాలుగా మారాయి. దేశ రాజధానిలో ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం ఆందోళన చెందాల్సి రావడం పాలనా వ్యవస్థల ముందున్న సవాలును తెలియజేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించడానికి తాత్కాలిక ఆంక్షలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమని సుప్రీంకోర్టు తాజాగా చేసిన పరిశీలనలు గుర్తుచేస్తున్నాయి. నవంబర్ 23న ఢిల్లీ వాయు కాలుష్యంపై జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక అంశాలను ప్రస్తావించింది. ఢిల్లీ లేదా జాతీయ రాజధాని ప్రాంతంలో బీఎస్-6 ఉద్గార ప్రమాణాలు పాటించే వాహనాలను మాత్రమే అనుమతించే అంశాన్ని పరిశీలించవచ్చని ధర్మాసనం పేర్కొంది. వాణిజ్య వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా సరిహద్దుల్లోనే సరుకులను దించి, తక్కువ కాలుష్యం కలిగించే వాహనాల ద్వారా నగరంలోకి తరలించే దీర్ఘకాలిక ప్రత్యామ్నాయాన్ని కూడా సూచించింది. అయితే ఇవి విచారణ సందర్భంగా వ్యక్తమైన పరిశీలనలు, సూచనలు మాత్రమే. బీఎస్-6 వాహనాలకే అనుమతి ఇవ్వాలనే తుది నిషేధ ఉత్తర్వు జారీ కాలేదు. ఈ అంశాన్ని పరిశీలించేటప్పుడు వాహన కాలుష్యం సమస్యలో ఒక భాగమని గుర్తించాలి. రహదారుల దుమ్ము, నిర్మాణ పనులు, పరిశ్రమల ఉద్గారాలు, వ్యర్థాల దహనం, వ్యవసాయ అవశేషాల దహనం, వాతావరణ పరిస్థితులు వంటి అనేక కారణాలు గాలి నాణ్యతను ప్రభావితం చేస్తాయి. ఒక్క వర్గం వాహనాలపై ఆంక్షలు విధించినంత మాత్రాన కాలుష్య సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని చెప్పలేం. ప్రతి కాలుష్య మూలం నుంచి వచ్చే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి సమగ్ర చర్యలు చేపట్టాలి. బీఎస్-6 ప్రమాణాలు వాహనాల నుంచి వెలువడే కాలుష్యకారకాలను నియంత్రించడానికి రూపొందించిన ఉద్గార ప్రమాణాలు. పాత ప్రమాణాల వాహనాలతో పోలిస్తే మెరుగైన నియంత్రణకు ఇవి ఉపయోగపడతాయి. అయితే ఒక వాహనం బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా ఉందనే కారణంతో దాని వల్ల కాలుష్యం అసలు ఉండదని భావించకూడదు. వాహనాల నిర్వహణ, ఇంధన నాణ్యత, ట్రాఫిక్ రద్దీ, ప్రయాణ దూరం కూడా ప్రభావం చూపుతాయి. వాహనాలపై కఠినమైన ఆంక్షలు విధించే ముందు ప్రజలపై పడే ఆర్థిక భారాన్ని పరిశీలించాలి. పాత వాహనాలు కలిగిన కుటుంబాలు, చిన్న వ్యాపారులు, సరుకు రవాణా కార్మికులు ఒక్కసారిగా కొత్త వాహనాలు కొనుగోలు చేయలేరు. ప్రజారోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ విధాన మార్పుల వల్ల జీవనోపాధి దెబ్బతినకుండా తగిన మార్పిడి వ్యవధి, సహాయక చర్యలు ఉండాలి. సుప్రీంకోర్టు సూచించిన సరిహద్దు సరుకు రవాణా కేంద్రాల ఆలోచనను కూడా సమగ్రంగా పరిశీలించాలి. నగరానికి రోజూ ఆహార పదార్థాలు, ఔషధాలు, నిర్మాణ సామగ్రి, ఇతర నిత్యావసర వస్తువులు చేరుతుంటాయి. భారీ వాహనాలను నగరంలోకి అనుమతించకపోతే ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థ సమర్థంగా పనిచేయాలి. లేకపోతే రవాణా ఖర్చులు పెరిగి వస్తువుల ధరలపై ప్రభావం పడవచ్చు. సరుకు నిల్వ కేంద్రాలు, విద్యుత్ వాహనాలు, రవాణా సమన్వయం, అవసరమైన మౌలిక సదుపాయాలపై ముందుగానే ప్రణాళిక ఉండాలి.

న కార్తీక సమో మాసః

ఇంటి ముంగిట తులసి కోట దగ్గర వెలిగించే దీపం, శివాలయంలో ఏడాది రోజులకు గుర్తుగా 365 వత్తులతో వెలిగించే దీపం, నదిలో తేలుతూ సాగే చిరుదీపం.. కార్తీక పున్నమి అనగానే కళ్లముందు మెదిలే దృశ్యాలివి. 'న కార్తీక సమో మాసః' అన్నది అత్రి మహాముని వచనం. కార్తీకంతో సమానమైన మాసం లేదని అర్థం. పౌర్ణమి నాడు చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరించే మాసానికి కార్తీకమని పేరు.

ఈ మాసంలో వచ్చే పున్నమిని భక్తులు శివరాత్రితో సమానంగా భావిస్తారు. శివాలయంలో పరమేశ్వరుడికి దీపారాధన చేసినా, ఉసిరి చెట్టు నీడన కార్తీక దామోదరుడిని పూజించినా.. శివకేశవులిద్దరికీ ప్రీతికరమైన ఈ పండుగలో దీపానికే పెద్దపీట. కార్తీక పౌర్ణమికి త్రిపుర పూర్ణిమ, రాస పూర్ణిమ, దేవ దీపావళి అనే పేర్లూ ఉన్నాయి. త్రిపుర పూర్ణిమ అనే పేరు వెనుక శివుడి విజయగాథ ఉంది. పురాణ కథనం ప్రకారం, నారదుడి నోట శంకరుడి కీర్తిని విన్న త్రిపురాసురుడు అసూయతో కైలాసంపైకి దండెత్తాడు. మూడురోజుల పాటు సాగిన యుద్ధంలో శివుడు త్రిపురాసురుడిని సంహరించాడు. వెయ్యేళ్ల అసుర పాలన అంతమైందన్న ఆనందంతో దేవతలు శంకరుడిని స్తుతించగా, శివుడు తాండవం చేశాడని ప్రతీతి. పద్నాలుగో మనువైన భౌత్యుడి పేరుతో ఈ పున్నమిని భౌత్య మన్వంతరాదిగానూ పిలుస్తారు. దీనికే ఇంద్ర సావర్ణిక మన్వంతరాది అనే పేరు కూడా ఉంది. కార్తీక పున్నమి నాడు శివాలయంలో దీపం వెలిగిస్తే ముక్కోటి దేవతలను పూజించినంత, పుణ్యనదుల్లో స్నానం చేసినంత ఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం. తెలిసీ తెలియక చేసిన తప్పులకు క్షమ కోరుతూ కొందరు రోజంతా ఉపవాసం ఉంటారు. సాయంత్రం ఏడాదిలోని ఒక్కో రోజుకూ ఒక్కో వత్తి చొప్పున 365 వత్తులు కలిపి దీపం వెలిగిస్తారు. మరికొందరు నదుల్లో, చెరువుల్లో దీపాలు వదులుతారు. కృత్తికా దీపోత్సవం, ఉసిరి చెట్టుకు ప్రదక్షిణలు, కార్తీక దామోదరుడికి దీపారాధన ఈ రోజు పాటించే ఆచారాలు. ఒళ్లంతా మంటలతో బాధపడిన బలి చక్రవర్తికి కార్తీక పున్నమి నాడు శివారాధనతో ఉపశమనం కలిగిందని ఓ పురాణగాథ. మహిషాసురుడితో యుద్ధంలో శివలింగాన్ని పగలగొట్టినందుకు ప్రాయశ్చిత్తంగా పార్వతీదేవి శివపూజ చేసిందని మరో కథనం.

దేవాలయాల్లో జరిగే దీపోత్సవాలకు ఎంత వైభవం ఉందో, ఇళ్లలో చేసుకునే వ్రతాలకు అంత ఆత్మీయత ఉంది. కేదారేశ్వర వ్రతంలో మర్రి ఊడలే తోరణాలు, మర్రి పండ్లే బూరెలు, మర్రి ఆకులే విస్తళ్లు. ఇలా పూజ చేస్తే భార్యాభర్తల అనుబంధం బలపడుతుందని నమ్మకం. పున్నమి నైవేద్యంలోనూ ఆయా ప్రాంతాల అభిరుచి కనిపిస్తుంది. తెలుగింట చలిమిడి చేస్తే, తమిళులు వేయించిన బియ్యం, అటుకులు నివేదిస్తారు. కార్తీక పున్నమికి జైనుల సంప్రదాయంలోనూ, పంజాబ్ ప్రజల ఆచారాల్లోనూ ప్రత్యేక స్థానం ఉంది. గంగా మహోత్సవంతోనూ ఈ పున్నమికి అనుబంధం ఉంది. బౌద్ధ సంప్రదాయంలో దీపాల వరుసలకు మరో కథ చెబుతారు. నాలుగు మాసాలు తల్లి వద్ద గడిపి తిరిగి భూలోకానికి వచ్చిన బుద్ధుడికి దీపాలు వెలిగించి స్వాగతం పలికారని ప్రతీతి. బర్మాలో ఆ వేడుక వేళ ఎటు చూసినా దీపాలే కనిపిస్తాయి. 'నందన సంవత్సరమున, పొందుగ కార్తీక శుద్ధ పున్నమ నాడున్' అన్న వేమన పద్యపాదాల్లోనూ ఈ పండుగ ప్రస్తావన ఉంది. ఆ పద్యాన్ని పరిశోధకులు క్రీ.శ. 1532 నాటిదిగా గుర్తించారు. శతాబ్దాల కిందట పద్యంలో వినిపించిన ఆ పున్నమి నేడు ప్రతి ఇంటా ఓ జ్ఞాపకంగా మిగులుతోంది. పెద్దలతో కలిసి వత్తులు లెక్కపెట్టడం, తులసి కోట ముందు తొలి దీపం వెలిగించడం, నీటిపై తేలే దీపాన్ని కనుమేర దాకా చూడటం.. ఒక తరం నుంచి మరో తరానికి కార్తీక పున్నమిని చేరవేసేది ఇలాంటి అనుభవాలే.



రామ్ మనోహర్ శర్మ బండపెల్లి
ఆధ్యాత్మిక పండితుడు
+91 8106194150

ఏఐ నియంత్రణ ఎవరి చేతిలో?

మానవ చరిత్రలో ప్రతి సాంకేతిక ఆవిష్కరణ కొత్త అవకాశాలకు ద్వారాలు తెరిచింది. అదే సమయంలో, మనిషి చేతికి చిక్కిన అపారమైన శక్తి విచక్షణారహితంగా వినియోగిస్తే ఎంతటి విధ్వంసానికి దారితీస్తుందో చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది. అగ్ని ఆవిష్కరణ నుంచి పారిశ్రామిక విప్లవం వరకు, విద్యుత్ వినియోగం నుంచి అణుశక్తి ఆవిర్భావం వరకు ప్రతి సాంకేతిక పరిణామం మానవ జీవన గమనాన్ని సమూలంగా మార్చివేసింది. అయితే, శక్తిని సృష్టించడం ఒక ఎత్తయితే.. దానిని ఎప్పుడు, ఎంతవరకు, ఏ ప్రయోజనం కోసం వినియోగించాలో నిర్ణయించడం మరో ఎత్తు. సాంకేతిక అభివృద్ధికి వేగం అవసరం, కానీ ఆ వేగానికి దిశానిర్దేశం చేసే బాధ్యత, నియంత్రించే వివేకం, మానవీయ విలువలు అంతకంటే అవసరం.

నేడు కృత్రిమ మేధ రంగంలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక పరిణామాలు ఈ రెండు అంశాల మధ్య ఉన్న అంతరాన్ని ప్రపంచం ముందుంచుతున్నాయి. మనిషి సృష్టించిన సాంకేతిక వ్యవస్థలు నేడు మానవ ఆలోచనా వేగాన్ని మించిపోయే స్థాయికి చేరుకుంటున్నాయి. సమాచారాన్ని విశ్లేషించడం, సమస్యలను పరిష్కరించడం, వ్యూహాలను రూపొందించడం, నిర్ణయాలకు అవసరమైన సూచనలు ఇవ్వడం, ఒకదానితో మరొక డిజిటల్ వ్యవస్థను అనుసంధానించి పనులను పూర్తి చేయడం వంటి సామర్థ్యాలను ఏఐ వేగంగా విస్తరించుకుంటోంది. ఈ పరిణామం మానవ జీవితాన్ని సులభతరం చేయగలదనే ఆశను కలిగిస్తూనే, సరైన నియంత్రణ లేకపోతే ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందనే ఆందోళనను కూడా పెంచుతోంది. ఇక్కడ అసలు ప్రశ్న ఏఐ ఎంత తెలివైనదన్నది కాదు; ఆ తెలివిని ఎక్కడ ఉపయోగించాలి, ఎంత స్వేచ్ఛ ఇవ్వాలి, దాని నిర్ణయాలను నియంత్రించే అధికారం ఎవరి చేతిలో ఉండాలన్నదే కీలకం.



దాదాపు ఎనభై ఏళ్ల క్రితం, 1942లో ప్రముఖ సైన్స్ ఫిక్షన్ రచయిత ఐజాక్ అసిమోవ్ 'రన్ అరౌండ్' అనే కథలో రోబోట్ల విధేయత, భద్రత, స్వీయరక్షణ మధ్య తలెత్తే సంఘర్షణలను ఆసక్తికరంగా చిత్రించారు. మనిషికి హాని చేయకూడదు, మనిషి ఇచ్చిన ఆదేశాలను పాటించాలి, తన ఉనికిని కాపాడుకోవాలి అనే మూడు నియమాల ద్వారా రోబోట్ల ప్రవర్తనకు ఒక నైతిక పునాది వేయడానికి ప్రయత్నించారు. తరువాత మానవాళి మొత్తం రక్షణను అత్యున్నత లక్ష్యంగా భావించే 'జీరోత్ లా'ను కూడా ప్రతిపాదించారు. అప్పట్లో ఇవన్నీ సాహిత్య ఊహలుగా కనిపించినప్పటికీ, నేటి కృత్రిమ మేధ వ్యవస్థల అభివృద్ధిని పరిశీలిస్తే అసిమోవ్ లేవనెత్తిన ప్రశ్నలు కేవలం కథలకే పరిమితం కాలేదని స్పష్టమవుతోంది. యంత్రాలకు సామర్థ్యాన్ని ఇవ్వడం కంటే, వాటి ప్రవర్తనకు నైతిక పరిమితులు విధించడం ఎంత ముఖ్యమో ఆయన రచనలు ముందుగానే హెచ్చరించాయి. నేటి ఏఐ ప్రపంచం కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే చాట్‌బాట్లతో ఆగిపోలేదు. సమాచారాన్ని సేకరించడం, కోడ్ రాయడం, డేటాను విశ్లేషించడం, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం, డిజిటల్ వ్యవస్థలతో అనుసంధానం కావడం, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు వరుసగా అనేక పనులను స్వయంగా నిర్వహించడం వంటి సామర్థ్యాలతో 'ఏఐ ఏజెంట్లు' కొత్త దశలోకి ప్రవేశిస్తున్నారు. ఒక వ్యక్తి ఇచ్చిన ఆదేశాల ఆధారంగా అనేక దశల పనులను పూర్తిచేసే ఈ వ్యవస్థలు భవిష్యత్తులో కార్యాలయాలు, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రభుత్వ పరిపాలన వంటి రంగాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. అయితే, లక్ష్యం సరైనదే అయినప్పటికీ, దాన్ని సాధించడానికి యంత్రం ఎంచుకునే మార్గాలు అనుకోని పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. ఒక వ్యవస్థకు ఇచ్చిన లక్ష్యాన్ని సాధించడమే ప్రధాన ప్రాధాన్యతగా మారితే, ఆ ప్రక్రియలో మానవీయ విలువలు, చట్టపరమైన పరిమితులు, సామాజిక బాధ్యతలు నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఏఐకి పనులు అప్పగించడం మాత్రమే కాదు, అది ఏ పరిధిలో పనిచేయాలి, ఏ చర్యలకు అనుమతి ఉండకూడదు అనే నియంత్రణలు కూడా స్పష్టంగా నిర్వచించాలి.

కార్పొరేట్ పోటీ.. సమాజానికి ముప్పు

సాంకేతిక అభివృద్ధి వెనుక కార్పొరేట్ సంస్థల పోటీ, పెట్టుబడుల ప్రవాహం, మార్కెట్ ఆధిపత్యం సాధించాలనే లక్ష్యాలు కీలకంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో ముందంజ వేయాలనే పోటీ తీవ్రంగా సాగుతోంది. కొత్త మోడళ్లను వేగంగా అభివృద్ధి చేయడం, వినియోగదారులను ఆకర్షించడం, మార్కెట్ వాటాను పెంచుకోవడం, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పొందడం వంటి అంశాలపై సంస్థలు దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ఈ పోటీలో భద్రతా పరీక్షలు, దీర్ఘకాలిక సామాజిక ప్రభావాల అధ్యయనం, నైతిక ప్రమాణాలు వెనుకబడిపోతే సాంకేతిక అభివృద్ధి సమాజానికి మేలు చేయడం కంటే ముప్పుగా మారే అవకాశముంది. సైబర్ భద్రతలో లోపాలను గుర్తించడానికి ఉపయోగించే ఏఐ సాధనాలు సరైన పరిమితులు లేకుండా పనిచేస్తే, అనుమతి లేని డిజిటల్ వ్యవస్థల్లోకి చొరబడటం, సమాచారాన్ని సేకరించడం, కీలక మౌలిక సదుపాయాలను దెబ్బతీయడం వంటి ప్రమాదాలు ఎదురుకావచ్చు. పరిశోధన కోసం ఇచ్చిన స్వేచ్ఛ దుర్వినియోగానికి దారితీస్తే బాధ్యత ఎవరిది? వ్యవస్థను రూపొందించిన సంస్థదా, దాన్ని వినియోగించిన వ్యక్తిదా, లేక దానికి అవసరమైన అనుమతులు ఇచ్చిన నిర్వాహకులదా? ఇటువంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం ఏఐ పాలనలో ప్రధాన సమస్యగా మారుతోంది. ఒక సంస్థ ఆర్జించే లాభాలు దాని వాటాదారులకు చెందుతాయి. కానీ ఆ సంస్థ రూపొందించిన సాంకేతిక వ్యవస్థ వల్ల జరిగే నష్టాన్ని మాత్రం వినియోగదారులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు, సమాజం మొత్తం భరించాల్సి రావచ్చు. 'లాభాలను ప్రైవేటీకరించి, ప్రమాదాలను సామాజీకరించే' ఈ ధోరణి బాధ్యతారాహిత్యమైన వ్యాపార సంస్కృతికి నిదర్శనం. సాంకేతిక సంస్థలు కేవలం తమ ఉత్పత్తుల విజయాన్ని మాత్రమే కాకుండా, వాటి వల్ల ఏర్పడే సామాజిక పరిణామాలకు కూడా బాధ్యత వహించాలి. ఏఐ అభివృద్ధి అనేది లాభాల లెక్కలకే పరిమితం కాకుండా, ప్రజల భద్రత, హక్కులు, జీవన ప్రమాణాలు, సమాజ స్థిరత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకునే విధంగా ఉండాలి.

పారదర్శకత బాధ్యత ఎవరిది?

ఏఐ వ్యవస్థలకు ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం, డేటాను మార్చడం, ఇతర సాఫ్ట్‌వేర్‌లతో అనుసంధానమై పనిచేయడం, వినియోగదారుల తరఫున చర్యలు చేపట్టడం వంటి అనుమతులు ఇచ్చినప్పుడు ప్రమాద తీవ్రత మరింత పెరుగుతుంది. ఒక చిన్న పొరపాటు అనేక వ్యవస్థలకు వ్యాపించి భారీ నష్టాన్ని కలిగించవచ్చు. అందుకే 'ఏఐ ఏం చేయగలదు?' అన్నదానికంటే 'ఏఐకి ఏం చేసే అనుమతి ఇవ్వాలి? ఏ చర్యకు ముందు మానవ అనుమతి తప్పనిసరి చేయాలి?' అనేది మరింత ముఖ్యమైన ప్రశ్నగా మారింది. స్వయంచాలకంగా పనిచేసే వ్యవస్థలకు అపరిమిత అధికారాలు ఇవ్వడం కంటే, అవసరమైన మేరకు మాత్రమే అనుమతులు కల్పించడం, కీలక చర్యలకు మానవ పర్యవేక్షణ ఏర్పాటు చేయడం, పొరపాట్లు జరిగినప్పుడు వెంటనే నిలిపివేసే వ్యవస్థలను సిద్ధం చేయడం అవసరం. విద్య, వైద్యం, బ్యాంకింగ్, న్యాయవ్యవస్థ, ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక వంటి రంగాల్లో అల్గారిథమ్స్ పాత్ర క్రమంగా పెరుగుతోంది. ఒక అల్గారిథమ్ ఒక విద్యార్థికి ప్రవేశాన్ని నిరాకరించినా, ఒక వ్యక్తికి రుణం మంజూరు చేయకపోయినా, ఉద్యోగ అవకాశాన్ని తోసిపుచ్చినా, ప్రభుత్వ పథకం నుంచి లబ్ధిదారుడిని తొలగించినా, ఆ నిర్ణయం వెనుక కారణాలను తెలుసుకునే హక్కు సంబంధిత వ్యక్తికి ఉండాలి. యంత్రం తీసుకున్న నిర్ణయమే అంతిమ తీర్పుగా మారకూడదు. నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం, మానవ అధికారితో సమీక్షించుకునే హక్కు, తప్పును సరిదిద్దుకునే ప్రక్రియ, అప్పీల్ చేసుకునే వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాలి.

ఆయుధీకరణ.. భౌగోళిక రాజకీయాల కొత్త ప్రమాదం

కృత్రిమ మేధను యుద్ధ ఆయుధంగా మార్చడం అత్యంత ప్రమాదకర పరిణామం. స్వయంచాలక డ్రోన్లు, లక్ష్యాలను గుర్తించే వ్యవస్థలు, నిఘా సాంకేతికత, సైబర్ యుద్ధ సాధనాలు, సైనిక వ్యూహాల రూపకల్పనలో ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యంత్రాలకు ప్రాణాంతక నిర్ణయాధికారాన్ని అప్పగించే అంశం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. కృత్రిమ మేధ విషయంలో అంతర్జాతీయ చైతన్యం, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, పౌర సమాజం మధ్య సమిష్టి చర్చ అవసరం. అణు విధ్వంసం భౌతికంగా కంటికి కనిపిస్తే, ఏఐ సృష్టించే సంక్షోభం గోప్యత, వ్యక్తిగత స్వేచ్ఛ, ఉపాధి, సామాజిక నమ్మకం, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిశ్శబ్దంగా దెబ్బతీసే అవకాశం ఉంది. అమెరికా, చైనా, యూరప్ వంటి శక్తులు ఏఐ ఆధిపత్యం కోసం సాగిస్తున్న పోటీ మరో సాంకేతిక ఆయుధ పోటీగా మారితే, దాని ప్రభావం ఒక్క దేశానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా భద్రత, ఆర్థిక వ్యవస్థలు, అంతర్జాతీయ సంబంధాలపై పడుతుంది. సాంకేతిక ఆధిపత్యం కోసం మానవ భద్రతను పణంగా పెట్టే పరిస్థితి రాకుండా ప్రపంచ దేశాలు ముందుగానే అప్రమత్తం కావాలి. కేవలం సాంకేతిక సంస్థల స్వీయ నియంత్రణపై ఆధారపడటం సరిపోదు. ప్రజల హక్కులు, భద్రత, గోప్యత, ఉపాధి, ప్రజాస్వామ్య వ్యవస్థలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాలు స్పష్టమైన చట్టపరమైన బాధ్యతను నిర్వర్తించాలి. అణుయుగం ప్రపంచానికి శక్తి ప్రమాదాన్ని పరిచయం చేస్తే, కృత్రిమ మేధ యుగం నిర్ణయాధికార ప్రమాదాన్ని మన ముందుంచింది. మానవ మేధస్సు తన సృజనాత్మకతతో అపారమైన సామర్థ్యం కలిగిన సాంకేతిక వ్యవస్థలను నిర్మించింది. అయితే ఆ వ్యవస్థలకు ఎంత స్వేచ్ఛ ఇవ్వాలి, ఎక్కడ పరిమితులు విధించాలి, ఎప్పుడు నిలిపివేయాలి, వాటి వల్ల కలిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహించాలి అనే ప్రశ్నలకు సమాజం సమాధానాలు కనుగొనాల్సిన సమయం ఆసన్నమైంది.

- డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.